సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
రంజాన్ వేళలు
ఇఫ్తార్ సాయంత్రం 6.25
సహర్ ఉదయం 5.18
హైదరాబాద్
శుక్రవారం, 20.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 120
పేజీలు: 12 వెల: రూ. 5

## ఏఐ పవర్‌హౌస్‌గా భారత్

### MANAV మంత్రం వివరించిన ప్రధాని మోదీ

- ఏఐతో మానవ చరిత్రకు కొత్త మలుపు
- టెక్నాలజీ కంటే పెద్దది మానవ సాధికారతే లక్ష్యం
- వైర్‌లెస్‌లా ప్రపంచాన్ని మార్చే శక్తి ఏఐలో ఉంది
- యువత, టాలెంట్‌తో ఏఐ హబ్‌గా భారత్ ఎదుగుదల
- 100 దేశాల నేతల మధ్య భారత విజన్‌కు గ్లోబల్ గుర్తింపు
- భవిష్యత్ తరాల కోసం బాధ్యతాయుత ఏఐ నిర్మాణం అవసరం

10







## ఆఖరి పోరాటం

మార్చి 31 డెడ్‌లైన్ దగ్గరపడడంతో ఆపరేషన్ కగార్2 వేగం పెంపు

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో హైఅలర్ట్ ప్రకటన

దేవ్‌జీ, బడే చొక్కారావు కోసం భద్రతా బలగాల వేట

- కర్రెగుట్టల అడవుల్లో 2 వేల బలగాలతో విస్తృత గాలింపు
- మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా ప్రత్యేక వ్యూహం
- గ్రేహౌండ్స్, సీఆర్పీఎఫ్, ఎస్ఐబీ సంయుక్త ఆపరేషన్
- ఏజెన్సీ ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్లు ముమ్మరం
- కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోయిస్టులు మృతి
- మావోయిస్టుల కదలికలపై నిఘా సంస్థల కట్టుదిట్టమైన పర్యవేక్షణ
- నక్సలిజాన్ని మార్చిలోపు అంతం చేయాలని కేంద్రం లక్ష్యం

02

*అడవి మళ్ళీ అట్టుడుకుతోంది. దశాబ్దాలుగా ఎర్రజెండా నీడన సాగిన సాయుధ పోరాటం ఇప్పుడు తన ఉనికి కోసం ఆఖరి యుద్ధం చేస్తోంది. ఒకవైపు 'మార్చి 31' నాటికి మావోయిజం అనే మాటే వినిపించకూడదన్న కేంద్ర ప్రభుత్వ కఠిన లక్ష్యం.. మరోవైపు అగ్రనేతలను వేటాడి పట్టుకోవాలన్న బలగాల వ్యూహం.. వెరసి తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో చావుకేకలు వినిపిస్తున్నాయి. 'ఆపరేషన్ కగార్–2' పేరుతో సాగుతున్న ఈ వేటలో కర్రెగుట్టల అడవులు రక్తాక్షరాలతో తడిసి ముద్దవుతున్నాయి. అగ్రనేతలే లక్ష్యంగా సాగుతున్న ఈ కూంబింగ్‌లో ఇప్పటికే ఐదుగురు మావోయిస్టులు నేలకొరిగారు. పచ్చని అడవిలో తుపాకుల గర్జనల మధ్య, ఒక సుదీర్ఘ పోరాట చరిత్ర ముగింపు అంచున నిలబడి ఉత్కంఠ రేపుతోంది.*

**-ముద్ర, తెలంగాణ బ్యూరో :**

## ఏఐసీసీకి టీపీసీసీ
# ప్రోగ్రెస్ రిపోర్ట్

### రెండున్నరేళ్ల ప్రగతిపై అధిష్టానానికి నివేదిక

అగ్రనేతలకు మహిళలు, రైతులు, యువత సాధికారత వివరాలు



- తెలంగాణ రైజింగ్ విజన్, దాని వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌పై చర్చ
- అధిష్టానానికి మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ
- రాష్ట్ర నేతలకు హైకమాండ్ కీలక సూచనలు
- నామినేటెడ్, కార్పొరేషన్ పోస్టుల భర్తీకి ఆదేశాలు

న్యూఢిల్లీ :
సర్పంచి.. మున్సిపల్ ఎన్నికల్లో విజయపరంపర.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పుంజుకున్న పార్టీ.. ప్రజాపాలనపై ప్రజల్లో పెరిగిన నమ్మకం.. వరుస ఓటములు, కేసుల విచారణలతో రాష్ట్రంలో నిస్సహాయ స్థితిలో ఉన్న ప్రతిపక్షం... కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయంగా అని చెప్పి మున్సిపల్ ఎన్నికల్లో ఒక కార్పొరేషన్.. ఒక మున్సిపాలిటీకే పరిమితమైన బీజేపీ... తెలంగాణ అభివృద్ధి, వికాసానికి సంబంధించిన ప్రణాళికలు, నివేదికలతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఢిల్లీ బాట పట్టిన తెలంగాణ కేబినేట్, రాష్ట్ర సీనియర్ నాయకులు గురువారం అక్కడ ఏఐసీసీ అగ్రనేతలతో భేటీ అయ్యారు. తెలంగాణ అభివృద్ధి పథాన్ని మరింత ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేతల రాహుల్ గాంధీతో రాష్ట్ర అభివృద్ధిపై చర్చలు జరిపారు. ముందుగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు, తర్వాత రాష్ట్ర రాజకీయ పరిస్థితులను అగ్రనేతలకు వివరించారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల ఫలితాలను వివరించారు. ఆయా ఎన్నికల్లో సీఎం, టీపీసీసీ చీఫ్ నేతృత్వంలో అనుసరించిన వ్యూహాలు, టీం వర్క్ ను వివరించారు. ఆయా ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఫలితాలపై సంతృప్తి వ్యక్తం చేసిన అగ్రనేతలు.. మీనాక్షి నటరాజన్, రేవంత్, మహేశ్ కుమార్ గౌడ్ తో పాటు మంత్రులు, సీరియర్ నాయకులను అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఫలితాలే పునరావృత్తం కావాలని అందుకు విభేదాలు పక్కనబెట్టి పని చేయాలని సూచించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే గతంలో పలువురు పార్టీ నేతల మధ్య నెలకొన్న విభేదాలు, పొరపచ్చాలపై సీరియస్ అయిన అధిష్టానానికి ప్రస్తుతం వారి మధ్య నెలకొన్న సయోధ్య గురించి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జీ మీనాక్షి నటరాజన్, సీఎం, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఇటీవలే నివేదిక ఇచ్చారు. దీనిపైనా ఖర్గే..ఆయా నేతలను సున్నితంగా మందలించినట్లు సమాచారం. ఈ చర్చలో సీఎం ప్రధానంగా వ్యవహరించారు. ఈ క్రమంలో సహచర నాయకులతో కలిసి 'తెలంగాణ రైజింగ్ 2047'విజన్, **మిగతా 02లో**

## ఇక స్మార్ట్ ప్రయాణం

జూన్ 2 నుంచి స్మార్ట్ కార్డులే ప్రామాణికం



- తొలి దశలో 5 లక్షల మందికి లబ్ధి
- పారదర్శకత కోసం ప్రభుత్వం చర్యలు
- ప్రతి మహిళకు ప్రత్యేక యూఐడీ నంబర్
- డిజిటల్ విధానంలో బస్సు ప్రయాణం
- రూ.75 కోట్లతో స్మార్ట్ కార్డు ప్రాజెక్ట్
- రాష్ట్రవ్యాప్తంగా 1.5 కోట్ల మందికి పంపిణీ

09

## హామీల అమలుకు నిధులివ్వాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్‌ను ప్రజల మధ్య నిలదీస్తాం
- బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ
- ఇచ్చిన హామీల్లో 95 శాతం పెండింగ్‌లోనే ఉన్నాయని బీఆర్ఎస్ ఆరోపణ
- రైతుబంధు, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కోసం ప్రత్యేక కేటాయింపులు చేయాలి
- హామీల అమలు లేకుంటే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించిన కేటీఆర్

03



## చరిత్ర మరవని యోధుడు

ఛత్రపతికి పలువురి నివాళి

*చరిత్ర పేజీల్లో నిక్షిప్తమైన పేరు కాదు ఆయనది.. ప్రతి భారతీయుడి రక్తంలో ప్రవహించే ధైర్యానికి పర్యాయపదం ఆయన. అన్యాయంపై ఎక్కు పెట్టిన బాణం.. ధర్మ రక్షణ కోసం కదంతొక్కిన సింహ గర్జన. కటిక చీకటిలో మగ్గుతున్న స్వరాజ్యాన్ని వెలుగు దిశగా నడిపించిన ఆ మహాయోధుడు, కోట్లాది మంది గుండెల్లో నేటికీ స్ఫూర్తి జ్వాలగా వెలుగుతూనే ఉన్నారు. కాలం మారినా, తరాలు మారినా 'ఛత్రపతి' అనే ఆ మూడక్షరాల పవర్ ఎప్పటికీ తగ్గదు. నేడు తెలుగు గడ్డపై మారుమోగుతున్న 'జై శివాజీ' నినాదం కేవలం ఒక కేక కాదు.. అది ఒక వీర చరిత పునరాగమనం!"*

05



## మార్చి 15లోగా నామినేటెడ్ పోస్టులు భర్తీ

పార్టీ కోసం పని చేసే వారికే ప్రాధాన్యం

- ఢిల్లీలో మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- వచ్చే రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ దే విజయం

03



## దానం సేఫ్?

బీఆర్ఎస్ నుంచి ముందే సస్పెన్షన్

*దానం నాగేందర్ అనర్హత వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు తీసుకుంటోంది. బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆయనను ముందుగానే సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారనే ప్రచారం ఊపందుకోవడంతో, దానంపై అనర్హత వేటు పడుతుందా లేదా అన్న దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ సస్పెన్షన్ అంశం నిజమైతే, ఫిరాయింపుల నిరోధక చట్టంలోని సాంకేతిక లొసుగులను ఉపయోగించి దానం అనర్హత నుంచి తప్పించుకునే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ వ్యవహారం కేవలం ఒక ఎమ్మెల్యే భవిష్యత్తుకే కాకుండా, బీఆర్ఎస్ రాజకీయ వైఖరిపైనా ప్రశ్నలు లేవనెత్తుతోంది.*

**-ముద్ర, తెలంగాణ బ్యూరో:**

- సస్పెన్షన్ అఫిడవిట్‌తో అనర్హత తప్పించుకుంటారా!
- దానంపై అనర్హతకు బ్రేక్ పడుతుందా!
- ఫిరాయింపుల కేసులో ట్విస్ట్..దానాన్ని కాపాడే అఫిడవిట్ ఇదేనా?
- సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ అఫిడవిట్..దానం భవితవ్యంపై సస్పెన్స్!
- సస్పెన్షన్ vs అనర్హత..దానం కేసులో చట్టపరమైన గందరగోళం
- రాజకీయ వ్యూహమా లేక లొసుగుల ఆటా?

02





## టీ20 వరల్డ్ కప్‌లో మరో సంచలనం

ఆస్ట్రేలియా తర్వాత శ్రీలంకపై కూడా జింబాబ్వే దూకుడు

- 179 లక్ష్యాన్ని సులభంగా ఛేజ్ చేసిన జింబాబ్వే.. కొలంబోలో లంకకు షాక్!
- బెన్నెట్ అజేయ అర్ధశతకం.. రాజా కెప్టెన్సీలో మరో సూపర్ విక్టరీ

11

## మంత్రులు, ఐఏఎస్‌ల అవినీతి బయటపెడతాం

కేంద్ర మంత్రి బండి సంజయ్

- బీజేపీని అడ్డుకోవాలని చూస్తే మీ సంగతి చూస్తాం
- మంత్రుల అవినీతికి మధ్యవర్తులుగా కొందరు ఐఏఎస్ లు
- భాగ్యనగర్ ప్రజలు కాంగ్రెస్‌ను మూసీలో పడేయడం ఖాయం

03



దేశంలో ఎన్నికల సంస్కరణలకు పార్టీలు, వారి విధానాలే ప్రధాన అడ్డుగా మారాయనడంలో ఎలాంటి సందేహం లేదు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 20.02.2026
www.mudranews.in | @mudranews



## అలిపిరి దాడి తర్వాత గ్రేహౌండ్స్ ఆపరేషన్స్



చంద్రబాబు నాయుడు మీద అలిపిరి బాంబు దాడి తరువాత మావోయిస్టులపై భారీ ఆపరేషన్స్ చేపట్టారు. గ్రేహౌండ్స్ దళాలు పలువురు కీలక నేతలను ఎన్‌కౌంటర్లలో హతమార్చినట్లు పేర్కొన్నారు.



# ఏఐసీసీకి టీపీసీసీ ప్రోగ్రెస్ రిపోర్ట్

(మొదటి పేజీ తరువాయి)

దాని వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, కీలక వాగ్దానాల అమలు, విధానపరమైన నిర్ణయాలు, అభి వృద్ధి పురోగతి, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు, నిర్మాణాత్మక సంస్కరణలపై అధిష్ఠానానికి సమగ్రంగా వివరించారు. సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న అంకితభావాన్ని సీఎం పునరుద్ఘాటించారు. డిసెంబర్ 2023లో 'ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం' కొలువుదీరినప్పటి నుంచి మహిళలు, రైతులు, యువత సాధికారత కోసం చేపట్టిన విప్లవాత్మక చర్యలను నాయకత్వానికి వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, జిల్లాలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి లభిస్తున్న విశేష ప్రజా మద్దతు, తదితర అంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జాతీయ నాయకత్వం ఇచ్చిన మార్గదర్శకత్వం తెలంగాణ సమగ్ర, సమాన అవకాశాల అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని బలపరుస్తుందని పేర్కొన్నారు.

**వాళ్లను వదులుకోవద్దు**

గత పదేండ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో లేకపోయినా ఇతర పార్టీల వైపు చూడకుండా పార్టీనే నమ్ముకుని పని చేసి, పార్టీ మళ్లీ అధికారంలో వచ్చేందుకు కృషి చేసిన నాయకులు, సీనియర్ కార్యకర్తలను ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకోవద్దని మల్లికార్జున ఖర్గే.. సీఎం, టీపీసీసీ చీఫ్ కు సూచించినట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ పదవుల భర్తీలో ఇంకా జాప్యం చేయవద్దని సూచించిన ఖర్గే... అర్హులకు ఆ పదవులు అప్పగించాలని ఆదేశించారు. రాష్ట్రంలో బలపడిన పార్టీ భవిష్యత్తులో మరింత బలపడి ఎదురులేని శక్తిగా అవతరించాలంటే పార్టీ నాయకత్వం కలిసికట్టుగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్ ల వైపు మొగ్గుచూపకుండా ఉండాలంటే పాలనపర నిర్ణయాలు ఒకటికి రెండు ఆలోచించి తీసుకోవాలని సూచించారు.



# ఆఖిరి పోరాటం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న మార్చి 31 గడువు దగ్గర పడుతోంది. కేవలం ఇంకో 40 రోజులు మాత్రమే మిగిలి ఉంది. అందుకే ఈ లోపు ఉన్న మావోయిస్టులను తుదముట్టించాలని ప్రభుత్వం ఆపరేషన్‌ను తీవ్రం చేసింది. దేశం నుంచి వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తి స్థాయిలో తుడిచి పెట్టాలనే కేంద్ర ప్రభుత్వ మిషన్ –2026 గడువు సమీపిస్తున్న వేళ తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో వాతావరణం వేడెక్కింది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా బలగాలు అత్యంత వ్యూహాత్మకమైన ఆపరేషన్ కగార్‌ను పునఃప్రారంభించాయి. ఈసారి కర్రె గుట్టల హిల్స్‌ను టార్గెట్ చేసుకున్నట్టు సమాచారం. అందుకే దీనికి ఆపరేషన్ కేజీహెచ్–2ను ప్రారంభించాయి. ఒకవైపు సరిహద్దుల్లో 2 వేల మంది సాయుధ బలగాల మోహరించారు. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అటవీప్రాంతాల్లో అగ్రనేత బడే చొక్కారావు, అలియాస్ దామోదర్‌తోపాటు బడానేతలు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ సంఖ్యలో బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.

**అగ్రనేతలే లక్ష్యంగా భారీ వ్యూహం**

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న మార్చి 31 గడువు దగ్గర పడుతోంది. కేవలం ఇంకో నలభై రోజులు మాత్రమే మిగిలి ఉంది. అందుకే ఈలోపు ఉన్న మావోయిస్టులను తుదముట్టించాలని ప్రభుత్వం ఆపరేషన్‌ను తీవ్రం చేసింది. సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ కేజీహెచ్–2 చేపడుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నంబి ప్రాంతం నుంచి వ్యాపించి ఉన్న కర్రె గుట్టల అడవుల్లో ఈ వేట కొనసాగిస్తున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జి అలియాస్ చేతన్, జూనియర్ క్యాడర్‌కు చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జి కేసా సోఢీ, బడే చొక్కారావులాంటి పెద్ద తలకాయలను పట్టుకోవడమే లక్ష్యంగా రెండు వేలకుపైగా బలగాలతో అడవిలో అణువణువూ గాలింపు చర్యలు చేపట్టారు. గతేడాది ఏప్రిల్‌లలో ఇదే గుట్టల్లో నిర్వహించిన 21 రోజుల సుదీర్ఘ ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులను హతమార్చారు. కానీ అగ్రనేతలు మాత్రం తప్పించుకున్నారు. ఈసారి వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టకూడదనే పట్టుదలతో బలగాలు ఉన్నాయి. ప్రస్తుతానికి తడపల, పామునూరు, మురుమూరు, దోలి వంటి ప్రాంతాల్లో నిరంతర నిఘా పెట్టారు.

**సరిహద్దుల్లో దామోదర్ కోసం వేట**

తెలంగాణలోని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దుల్లో బడే చొక్కారావు అలియాస్ దామోదర్ షెల్టర్ తీసుకున్నారని పక్కా సమాచారం అందింది. అందుకే ఈ ప్రాంతాల్లో కూడా హై అలర్ట్ ప్రకటించారు. దామోదర్ స్వస్థలమైన తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఆ గ్రామం నుంచి కీలక సమాచారం బయటకు వెళ్తుందని అనుమానంతో నిఘా విభాగం, గ్రేహౌండ్స్ దళాలు అప్రమత్తమయ్యాయి. పెద్దాపూర్, కొప్పుగుట్ట, గండికామారం వంటి ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

**గ్రేహౌండ్స్- ఎస్ఐబీ రంగ ప్రవేశం**

రాష్ట్రంలోని అత్యంత శక్తిమంతమైన నిఘా విభాగం, గ్రేహౌండ్స్ దళాలు ఈ ఆపరేషన్‌లో భాగస్వామ్యం అయ్యాయి. ముత్తారం మండలంలోని సర్వాయిపేట అడవుల నుంచి ఇతర ప్రాంతాల వరకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అడ్డగుట్ట అడవుల్లో సాయుధ బలగాలు మ తాత్కాలిక స్థావరాలను ఏర్పాటు చేసుకున్నాయి. ప్రధాన రహదారుల మీద చెక్‌పోస్టుల ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు.

**మళ్లీ ఎన్ కౌంటర్..**

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టు అగ్రనేత, కార్యదర్శి దేవ్‌జీ సహా కీలక నేతలు ఈ ప్రాంతంలో ఉన్నారన్న పక్కా సమాచారంతో బలగాలు వెళ్లాయి. అగ్రనేతల కోసం 'ఆపరేషన్ కగార్–2'లో భాగంగా కూంబింగ్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు అగ్ర నేతలు ఉన్నట్టుగా సమాచారం. ఆపరేషన్ కగార్ 2 పేరుతో కర్రెగుట్టలో భద్రతా బలగాల కూంబింగ్ చేస్తున్నాయి. మావోయిస్టు అగ్ర నేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కగార్ 2 నడుస్తోంది. ఆపరేషన్ కగార్ డెడ్ లైన్ ఇంకా 40 రోజులే మిగిలి ఉంది. దీంతో ఛత్తీస్‌గఢ్ పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలతో కూంబింగ్ చేస్తున్నాయి. 2 వేలకు పైగానే బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. నక్సలిజాన్ని మార్చిలోపు అంతం చేయాలనే కేంద్ర మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు వేట కొనసాగుతోంది. అందులో భాగంగానే కర్రెగుట్టలు హిల్స్ 2ను బలగాలు ప్రారంభించాయి. మావోయిస్టులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అగ్రనేతలే టార్గెట్‌గా బలగాలకు ఆదేశాలు వెళ్లాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జీ, జూనియర్ క్యాడర్‌కు చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జీ కేసా సోది కోసం కర్రెగుట్టల్లో బలగాలు వేట కొనసాగిస్తున్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టులు తలదాచుకున్నట్టుగా భద్రతా బలగాలకు పక్కా సమాచారం వచ్చింది. దీంతో బలగాలు ముందుకుసాగాయి. మావోయిలు ఎదురుపడటంతో కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్ జరిగింది. కొద్దిసేపటికి కాల్పులు ఆగిపోయాయి. ఆ ప్రాంతంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను బలగాలు గుర్తించాయి. మృతుల్లో అగ్రనేతలు ఉన్నారని ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది.

కొంతకాలంగా ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు బలగాలు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. ఇందులో భాగంగా అగ్రనేతలను పార్టీ కోల్పోయింది. ఎన్‌కౌంటర్‌లో కొందరు మరణించగా.. మరికొందరు లొంగిపోయారు. దీంతో మావోయిస్టులు తలదాచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా మధ్యప్రదేశ్ నుంచి కర్రెగుట్టల్లోకి మావోలు ప్రవేశించారనే సమాచారంతో కూంబింగ్ చేస్తుండగా ఎన్‌కౌంటర్ జరిగింది.

**మిగిలింది కొందరే**

మార్చినాటికి మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం టార్గెట్ పెట్టుకుంది. మరి కొన్ని రోజుల్లో ఆపరేషన్ కగార్ గడువు ముగియనుంది. మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీ, బడే చొక్కారావులాంటివారు ఇప్పుడు కర్రెగుట్టల ప్రాంతంలోనే ఉన్నారని బలగాలు జల్లెడ పడుతున్నాయి. మరణించిన ఐదుగురు మావోయిస్టుల గుర్తింపు తెలియాల్సి ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో ఆయుధాలు, విప్లవ సాహిత్యం దొరికినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 15 మంది వరకు మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు.



# ధోనీ పొలంలో టమోటాలొచ్చాయి



**ముద్ర, డెస్క్:**

భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకి వ్యవసాయం అంటే చాలా ఇష్టం. రాంచీకి దగ్గరలోని సాంబో గ్రామంలో ధోనీకి ఫామ్‌హౌస్ ఉంది. అప్పుడప్పుడు ట్రాక్టర్ దున్నుతూ ఉన్న ధోనీ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుంటాయి. దాదాపు 38 ఎకరాల్లో వ్యవసాయం చేస్తుంటాడు. ఈసారి సీజన్‌లో టమోటాపై దృష్టి పెట్టాడు. ఆర్గానిక్ టమోటా రకాలను పండించాడు. పంటను కోసి మార్కెట్‌కు తరలించినట్లు తెలుస్తోంది. దీంతో స్థానికులతోపాటు వ్యాపారుల్లోనూ ఇప్పుడు ఇది హాట్ టాపిక్‌గా మారింది. సైంటిఫిక్ పద్ధతిలో.. అక్కడి నేల, వాతావరణానికి తగ్గట్టుగా టమోటాను ఎంపిక చేసుకుని పండించడం గమనార్హం. ఇందులో రెడ్, లోకల్, చెర్రీ, హైబ్రిడ్ రకాలు ఉన్నాయి. పరిమాణం, రుచి, నాణ్యతపరంగా విశిష్టత కలిగి ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. రాంచీలోని హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ఈ టమోటాలకు డిమాండ్ బాగా పెరిగింది. బయటి నుంచి వచ్చే ట్రేడర్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ధోనీ ఫామ్‌లో పంటలకు ఎలాంటి రసాయన ఎరువులను వాడటం లేదు. క్రిమిసంహారక మందులు కూడా ఆర్గానిక్‌గానే తయారు చేసుకుంటున్నారు. ఆవు పేడను వినియోగిస్తారు. సంప్రదాయ, సహజ సిద్ధమైన పద్ధతులను వాడుతున్నారు. టమోటాలే కాకుండా.. క్యాబేజీ, బఠానీలు, బ్రకోలీ, గుమ్మడి, బెండ కాయలు, వంకాయలతోపాటు పైనాపిల్, మామిడి కాయలు, జామ, బొప్పాయ కూడా పండిస్తున్నారు. అయితే, ప్రస్తుతం ఇక్కడ మేలిమిరకం టమోటాలు ప్రధానమైనవి. స్ట్రాబెర్రీలను కూడా పండిస్తుండటం గమనార్హం. 'ఈసారి ఇక్కడ టమోటానే స్పెషల్. ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు లేకుండా పెంచాం. సహజసిద్ధమైనవే వాడాం. మాకు ఈసారి వాతావరణం కూడా సహకరించింది. అందుకే, మంచి దిగుబడి వచ్చింది'' అని ఫామ్ కేర్ టేకర్ వెల్లడించారు. వ్యవసాయ నిపుణుడు రాజీవ్‌కుమార్ పరిహార్ స్పందిస్తూ 'ధోనీ కృషి వల్లే సాగు భూమిగా మారింది. అతడి ఆసక్తితో నాణ్యమైన విత్తనాలు వాడాం. దీంతో నాణ్యమైన కూరగాయలు పండుతున్నాయి'' అని తెలిపారు.

# దానం సేఫ్?

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

దానం నాగేందర్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేశామని బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్ లో పేర్కొన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అదే నిజమైతే దానం నాగేందర్ పై అనర్హతా వేటు పడనట్లే. దానం నాగేందర్ పార్టీ మార్పిడి, అనర్హత వేటు అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. దానంపై అనర్హతా వేటు కోసం బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. అదే సమయంలో ఆయన లోక్ సభకు పోటీ చేయడంతో బీజేపీ కూడా అనర్హతా పిటిషన్ వేసింది. దానిపై తాజాగా విచారణ జరిగింది. అయితే దానంపై సస్పెన్షన్ వేటు వేసినట్లుగా బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసిందని బిజెపి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చెబుతున్నారు. అయితే ఈ విషయంపై బీఆర్ఎస్ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

**సస్పెన్షన్ వేటు - వ్యూహాత్మక రక్షణ?**

సాధారణంగా ఒక పార్టీకి చెందిన ఎమ్మెల్యే మరో పార్టీలోకి వెళ్తే ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. అయితే, ఒకవేళ పార్టీయే సదరు నేతను ముందే సస్పెండ్ చేసినట్లు కోర్టుకు తెలిపితే, అప్పుడు ఆ నేత స్వతంత్ర హోదాను పొందుతాడు లేదా సాంకేతికంగా అనర్హత నుంచి తప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. బిఆర్ఎస్ పార్టీ దానం నాగేందర్‌ను సస్పెండ్ చేసినట్లు అఫిడవిట్ ఇచ్చి ఉంటే, అది ఆయనను అనర్హత నుంచి కాపాడుతుంది. ఒకవైపు తమ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ చేర్చుకుంటోందని బిఆర్ఎస్ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పోరాటం చేస్తోంది. మరోవైపు, అదే పార్టీకి చెందిన కీలక నేతపై అనర్హత వేటు పడకుండా సస్పెన్షన్ అనే అస్త్రాన్ని ప్రయోగిస్తే, అది ఆ పార్టీ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తుంది.

**ఫిరాయింపుల చట్టం - సాంకేతిక లొసుగులు**

రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినా లేదా విప్ ధిక్కరించినా అనర్హత వేటు పడుతుంది. కానీ, పార్టీయే సదరు సభ్యుడిని బహిష్కరిస్తే అతను సభలో స్వతంత్రుడిగా కొనసాగవచ్చు. ఒకవేళ బిఆర్ఎస్ అఫిడవిట్‌లో సస్పెన్షన్ ప్రస్తావన ఉంటే, పిటిషనర్ల వాదన కోర్టులో వీగిపోయే ప్రమాదం ఉంది. దీన్నే ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాజకీయ కుట్రగా అభివర్ణిస్తున్నారు. ఒకవేళ బిఆర్ఎస్ కావాలనే దానంను కాపాడుతోందని ప్రజల్లోకి సంకేతాలు వెళ్తే, ఆ పార్టీ నైతిక విజయాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా ఇతర ఎమ్మెల్యేల అనర్హత విషయంలో బిఆర్ఎస్ చేస్తున్న పోరాటానికి విలువ లేకుండా పోతుంది. తమ పార్టీ నేతలను కాంగ్రెస్‌కు అప్పగించి, బయటకు మాత్రం పోరాడుతున్నట్లు నటిస్తున్నారు అనే విమర్శలను కేడర్ నుంచి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇది పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.

**అధికారికంగా స్పందించని బీఆర్ఎస్**

ప్రస్తుతం నెలకొన్న గందరగోళంపై బిఆర్ఎస్ నాయకత్వం తక్షణమే స్పందించాల్సి ఉంది. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఏముందో బహిరంగ పరచకపోతే, రాజకీయంగా బిఆర్ఎస్ ఆత్మరక్షణలో పడక తప్పదు. బిజెపి చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలంటే చట్టపరమైన ఆధారాలతో క్లారిటీ ఇవ్వడం ఆ పార్టీకి అత్యవసరం. దానం నాగేందర్ విషయంలో జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం ఒక ఎమ్మెల్యే అనర్హతకు సంబంధించినవి మాత్రమే కాదు..కీలక రాజకీయ మార్పులకు కారణం అయ్యే అంశం అవుతుందని భావిస్తున్నారు.

# భారత్ తో చెలిమికి బంగ్లా తహతహ..

**ముద్ర, డెస్క్:**

బంగ్లాదేశ్‌లో 18 నెలల మహ్మద్ యూనస్ పాలన తర్వాత నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) ఘన విజయం సాధించింది. తారీఖ్ రహ్మాన్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ప్రధానిగా తారీఖ ప్రమాణస్వీకారం చేశారు. 50 మందితో కొత్త కేబినెట్ ఏర్పాటు చేశారు. ఇందులో మైనారిటీలు అయిన బౌద్ధ, హిందూ సమాజానికి చెందిన ఇద్దరికి అవకాశం కల్పించారు. తద్వారా భారత్‌తో సత్సంబంధాలకు సంకేతాలిచ్చారు.

**మైనారిటీ మంత్రులు..**

హిందూ సంఘ నేత నితాయి రాయ్‌చౌదరి (బీఎన్‌పీ సీనియర్ వైస్ చైర్మన్)ని సాంస్కృతిక మంత్రిగా నియమించారు. బౌద్ధ చక్మా నేత దీపెన్ దేవాన్ చిట్టాగాంగ్ హిల్ ట్రాక్ట్స్ మంత్రిగా నియమించారు. బంగ్లాదేశ్‌లో హిందూవులు 8 శాతం ఉంటారు.

**భారత్‌ను చల్లబరిచే చర్య..**

మహ్మద్ యూనస్ ప్రభుత్వం 18 నెలల పాలనలో సాగించిన అరాచకాలతో బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు పెరిగాయి. చాలా మంది హత్యకు గురయ్యారు. ఇక మహ్మద్ యూనస్ చైనా, పాకిస్తాన్‌తో చేతులు కలిపి భారత్‌పై విద్వేషాన్ని పెంచారు. దీంతో భారత్–బంగ్లాదేశ్ సంబంధాలు దెబ్బతిన్నాయి. భారత్ ఏటా బంగ్లాదేశ్‌కు అందించే ఆర్థిక సాయాన్ని సగానికి తగ్గించింది. అదాని విద్యుత్ సరఫరా నిలిపివేసింది. ఈ నేపథ్యంలో భారత్‌తో మంచి సంబంధాలు బంగ్లాదేశ్ ఆర్థిక, రాజకీయ భద్రతకు అవసరమని తారీఖ్ ప్రభుత్వం గుర్తించింది. మైనారిటీలపై దాడులు, ఆస్తి హింసలు భారత విమర్శలకు దారితీయకుండా చర్యలు చేపడుతోంది.

తారీఖ్ ప్రభుత్వం మరోవైపు దేశంలో జమాత్–ఇ–ఇస్లామీ పార్టీ బలపడకుండా చర్యలు తీసుకుంటున్నారు. తీవ్రవాద ఆగడాలను అరికట్టాలంటే బీఎన్‌పీ నిజాయితీ పరీక్షించాలి.

# ఆఫీసుకే రాని ఉద్యోగికి రూ.10 కోట్ల జీతం

**ముద్ర , డెస్క్:**

అమెరికాలో కార్పొరేట్ వ్యవస్థను కుదిపేసేలా ఒక సంచలన మోసం వెలుగులోకి వచ్చింది. పని చేయకుండానే కోట్ల రూపాయల వేతనం పొందిన 'ఘోస్ట్ ఉద్యోగి' కేసు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. భారత సంతతికి చెందిన కరణ్ గుప్తా, మిన్నెసోటాలోని ప్రముఖ హెల్త్‌కేర్ సంస్థ అనుబంధ సంస్థ 'ఆప్టమ్'లో సీనియర్ డైరెక్టర్‌గా పనిచేస్తూ తన అధికారాన్ని దుర్వినియోగం చేశాడు. అర్హతలు లేని తన స్నేహితుడిని తప్పుడు పత్రాలతో ఉద్యోగంలోకి చేర్చి, అతడిని 'కాగితం మీద మాత్రమే ఉన్న ఉద్యోగి'గా మార్చాడు.

**పని లేకుండా జీతం..**
**జీతం నుంచి భాగం మళ్లీ అతడికే!**

2015లో ఉద్యోగంలో చేరిన ఆ వ్యక్తి ఒక్కరోజు కూడా ఆఫీసుకు హాజరుకాలేదు. సహోద్యోగులతో పరిచయం లేదు, కంపెనీ మెయిల్స్‌లో చరిత్ర లేదు, అతనికి కేటాయించిన కంప్యూటర్‌లో లాగిన్ కూడా కాలేదు. అయినా ప్రతి ఏడాది లక్ష డాలర్లకు పైగా వేతనం, పెరుగుదలలు, బోనస్‌లు అందుకున్నాడు. ఇందులో అసలు ట్విస్ట్ ఏమిటంటే.. ఆ 'ఘోస్ట్ ఉద్యోగి'కి వచ్చే జీతంలో పెద్ద భాగం తిరిగి గుప్తా ఖాతాలోకి వెళ్లేది. న్యూజెర్సీలో ఉండే అతడి స్నేహితుడు నగదు రూపంలో డబ్బు తీసి గుప్తాకు చేరవేసేవాడు.



**రూ.10 కోట్ల మోసం..**
**మనీలాండరింగ్ ఆరోపణలు**

2019లో గుప్తాపై మరో మోసం కేసు నమోదు కావడంతో ఉద్యోగం కోల్పోయాడు. అదే సమయంలో ఈ పెద్ద స్కామ్ బయటపడింది. దర్యాప్తులో మొత్తం 1.2 మిలియన్ డాలర్లు (సుమారు రూ.10 కోట్లు) అక్రమంగా పొందినట్లు తేలింది. న్యాయస్థానం గుప్తా అధికార దుర్వినియోగంతో కంపెనీని మోసం చేసినట్లు స్పష్టం చేసింది. అదనంగా మనీలాండరింగ్ కుట్రకు సంబంధించిన ఆరోపణలు నమోదయ్యాయి. కార్పొరేట్ ప్రపంచానికి హెచ్చరిక ఈ ఘటన కంపెనీలలో నియామకాల పర్యవేక్షణ ఎంత ముఖ్యమో మరోసారి గుర్తుచేసింది. కాగితాల మీద ఉన్న ఉద్యోగులు కూడా కోట్ల నష్టానికి దారి తీస్తారని ఈ కేసు నిరూపించింది.

## నల్లమల ఆపరేషన్స్ (2005–2008)



నల్లమల అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులపై విస్తృతంగా ఎన్‌కౌంటర్లు జరిగాయి. ప్రభుత్వ వాదన ప్రకారం ఇవి అరణ్య భద్రత కోసం అవసరమని చెప్పగా, మానవ హక్కుల సంస్థలు ప్రశ్నించాయి.

# ప్రజాక్షేత్రంలో తిరగలేరు..

- ఎక్కడికక్కడ నిలదీస్తాం
- హామీల అమలుకు నిధులు కేటాయించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, వాగ్దానాల అమలుకు రాష్ట్ర బడ్జెట్ లో తగిన నిధులు కేటాయించకపోతే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులను ఎక్కడికక్కడ నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ప్రజాగ్రహానికి ముఖ్యమంత్రితోపాటు, మంత్రులు ప్రజాక్షేత్రంలో తిరగలేరన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చి దాదాపు సగం కాలం పూర్తవుతున్నా ఇప్పటికీ ఇచ్చిన హామీల్లో 95 శాతం పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. ఈసారి బడ్జెట్‌లో అయినా ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేటీఆర్.. సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. నిధులు కేటాయించకపోతే తెలంగాణ సమాజం ఇంకా ఓపికపట్టే ప్రసక్తే లేదని గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చి వాటి అమలను పక్కన పెట్టారని రెండు బడ్జెట్లలో హామీల అమలు కోసం కేటాయింపులు చేయని ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో అయినా నిధులు కేటాయించాలని నాలుగు కోట్ల ప్రజల పక్షాన కోరుతున్నానన్నారు. ఆరు గ్యారెంటీలో హామీ ఇచ్చిన మహిళలు, వృద్ధులు, విద్యార్థి, యువత, రైతన్నల కోసం భారీగా నిధులు కేటాయించాలని కోరారు. డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. 20262027 బడ్జెట్‌లో 6 గ్యారెంటీలు, 420 హామీలు, డిక్లరేషన్ల కింద ఇచ్చిన వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకపోతే ఎక్కడికక్కడ మోసకారి కాంగ్రెస్‌ను ప్రజలపక్షాన నిలదీస్తామని హెచ్చరించారు. రైతుబంధును రూ. 15 వేలకు పెంచుతామని మాటిచ్చి మోసం చేసినందుకు ముందు క్షమాపణలు చెప్పి, ఆ మొత్తాన్ని బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. తొలి ఏడాదే రెండులక్షల ఉద్యోగాల భర్తీతో పాటు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుకు కూడా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలన్నారు. ప్రజాపాలన పేరిట మరొక్కసారి ప్రజలను మభ్యపెట్టడానికి, నిట్టనిలువునా మోసగించడానికే సన్నాహాలు చేస్తున్నట్లు కనబడుతోందన్నారు. పనికిరాని అంశాలను తెరపైకి తెచ్చి ప్రతిసారి అటెన్షన్ డైవర్ట్ చేయాలని మీరు చేస్తున్న కుట్రలు తెలంగాణ సమాజానికి అర్థమైపోయాయన్నారు. ప్రజల నోట్లో మట్టికొట్టిన మీ పాపాల ప్రక్షాళన జరగాలంటే కనీసం ఈ సారి బడ్జెట్ లోనైనా కేటాయింపులు చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు.





# వైభవంగా కొనసాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు

- రెండో రోజు ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ,
- బేరి పూజ, దేవతాహ్వానం, హవనం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు గురువారం ఉదయం అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, కార్యక్రమాలు శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా ఆలయ ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు, అర్చకబృందం, పారాయణీకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కార్యనిర్వహణాధికారి జె.భవాని శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు, పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు.

**ధ్వజారోహణం ప్రత్యేకత**

బ్రహ్మోత్సవాలలో శ్రీస్వామివారి అనుగ్రహంను పొందగోరి ధ్వజ పటంపై గరుడాళ్వారుని చిత్రించి, ఆరాధించి సకలోపచారాలతో మేళతాళాల మధ్య శ్రీ స్వామివారి ఆలయ ధ్వజస్తంభముపై ధ్వజ పటమును అలంకరించెదరు. భగవానుని దివ్యదేహమే వేదమయమని ఆ వేద స్వరూపుడు గరుత్మంతుడు అని ఉత్సవ ప్రారంభ సూచకముగా ఆలయంలో ఈ వేడుక నిర్వహించెదరు. భగవత్ అనుగ్రహపూర్వకముగా నిర్వహించుటకు సమస్త దేవతలను ఈ వేడుకకు విచ్చేయమని వేడుకునే ప్రక్రియే ఈ ధ్వజారోహణం అంటారు. గరుడ ప్రసాదమును భక్తులు సంతాన సాఫల్యముగా స్వీకరించి స్వామి వారి అనుగ్రహాన్ని పొందానికి ప్రత్యక్ష నిదర్శనమై ఉన్నది.

**సాయంకాల కార్యక్రమాలు**

గురువారం సాయంకాలం శ్రీ స్వామివారి ఆలయంలో నిత్యారాధనల అనంతరం హవనం ప్రారంభించబడును. దేవతాహ్వానం, వేడుకలను భేరీపూజ, ఆలయ ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు, అర్చ కబృందం, పారాయణీకులు నిర్వహిస్తారు.

**భేరీపూజ ప్రత్యేకత**

శబ్దమే బ్రహ్మం. భేరీ అనగా సాంప్రదాయానుసారముగా ఒక వాయిద్య సాధనము నుండి వెలువడు శబ్దము. ఆయారాగ తాళముల మధ్య మంత్రబద్ధమైన శ్లోకాలను పఠిస్తూ భేరీ తాడనం చేయుచూ ఈ వేడుక నిర్వహించెదరు. భేరీనాదం వినిపించునంత వరకు సర్వవిధదోష నివారణం జరిగి ఆరోగ్యం, మానసిక ఆనందం చేకూరునని జగత్ కళ్యాణ కారకమైన ఈ భేరీపూజ ద్వారా భగవానుడు తృప్తి చెంది అనుగ్రహించునని ఈ వేడుక నిర్వహిస్తారు.

**హవనం ప్రత్యేకత**

బ్రహ్మాది దేవతలకు అందజేయు హవిస్సును ఆయా దేవతా సంబంధమైన మంత్రముల చేత హవనము గావించెదరు. విశ్వశాంతి లోకకళ్యాణం కలిగించు ఈ హవనం బ్రహ్మోత్సవములలో ఉత్సవాంతము వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

**ఉచిత వైద్య శిబిరం**

శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా 18 నుండి 28 వరకు మెడికవర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ, హైదరాబాద్ వారిచే ఉచిత వైద్య శిబిరం కొండపైన ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నారు.

**దేవతాహ్వానం ప్రత్యేకత**

బ్రహ్మోత్సవాల్లో భక్తకోటిని అనుగ్రహించు స్వామివారు దేవకోటిని అనుగ్రహించిన తీరు ఈ దేవతాహ్వానంలో సివించవచ్చును. 33 కోట్ల మంది దేవతలను మంత్రపూర్వకంగా ఆహ్వానము గావించుట ఈ వేడుక ప్రత్యేకత.

# తెలంగాణ తల్లి విగ్రహాల ప్రతిష్ఠ

- అన్ని జిల్లాల కలెక్టరేట్లలో ఏర్పాటుకు పరిపాలన అనుమతులు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాల ప్రాంగణాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్టించేందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతికి ప్రతీకగా నిలిచే తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో ఉన్న ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ ప్రాంగణాల్లో ఈ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.5.80 కోట్లు కేటాయిస్తూ బడ్జెట్ విడుదల ఉత్తర్వులను జారీ చేసింది. ఈ పనులను రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన పరిపాలనాపరమైన అనుమతులు లభించడంతో త్వరలోనే విగ్రహాల తయారీ, ప్రతిష్ఠాపన పనులు ప్రారంభం కానున్నాయి.

# ఎదురులేని శక్తిగా కాంగ్రెస్

- మార్చి 15లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ
- పార్టీ కోసం పని చేసే వారికే ప్రాధాన్యం
- వచ్చే రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ దే విజయం
- ఢిల్లీలో మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**ముద్ర, న్యూఢిల్లీ :**

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులన్నింటినీ వచ్చే నెల 15 లోపు భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. పార్టీ రాష్ట్రంలో అధికారంలో వచ్చేందుకు, అహర్నిషలు పార్టీ కోసం కష్టపడ పని చేసే నాయకులకు ఆయా పోస్టుల్లో ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బలపడిన కాంగ్రెస్.. మున్ముందు ఎదురులేని శక్తిగా నిలవబోతోందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్‌కు తిరుగులేదన్న ఆయన వచ్చే రెండు ఎన్నికల్లోనూ విజయం సాధించి తిరిగి అధికారాన్ని కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రివర్గంతో ఢిల్లీ పర్యటనలో ఉన్న మహేశ్ కుమార్ గౌడ్ గురువారం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. అనంతరం అక్కడి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ మంత్రులు అందరితో కాంగ్రెస్ అగ్రనాయకులు సమావేశం అయినట్లు వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు.. రేవంత్ రెడ్డి సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. పంచాయతీలు, మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభినందించారని మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని తెలంగాణ ప్రజలు ఆస్వాదిస్తున్నారు కాబట్టి.. మున్సిపల్ ఎన్నికల్లో తమను ఆశీర్వదించారని చెప్పారు. రాష్ట్రంలో 80 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారన్నారు. తెలంగాణలో నడుస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ విధి విధానాల గురించి రాహుల్ గాంధీ అడిగి తెలుసుకున్నారని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తోందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వివరించారు.

# ఆదర్శవంతంగా పీఎం శ్రీ స్కూళ్లు

**ముద్ర, ఖమ్మం:**

మన పిల్లలను ఎటువంటి పాఠశాలలకు పంపాలనుకుంటామో ఆ స్థాయిలో పీఎం శ్రీ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చి దిద్దాలని కేంద్ర బయో టెక్నాలజీ శాఖ జాయింట్ సెక్రటరీ ఏక్తా విష్ణోయి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం కేంద్ర బయో టెక్నాలజీ శాఖ జాయింట్ సెక్రటరీ, పీఎం శ్రీ పాఠశాలలపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ లతో కలిసి విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ..తల్లిదండ్రులు సంతోషంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలనే ఉద్దేశ్యంతో పిఎం శ్రీ పాఠశాలల కాన్సెప్ట్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. పిల్లల తల్లిదండ్రులకు గర్వకారణంగా ఉండే విధంగా పీఎం శ్రీ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు.

# పునర్విభజన చట్ట విరుద్ధం?

- జీహెచ్ఎంసీ పునర్విభజనపై హైకోర్టు సీరియస్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు
- మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం
- జీవో 55ను రద్దు చేయాలంటూ కోర్టును ఆశ్రయించిన గురువా రెడ్డి




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

జీహెచ్ఎంసీ పునర్విభజనపై హైకోర్టు సీరియస్ అయింది. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోపై మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గురువారం నోటీసులు జారీ చేసింది. జనగణన-2027 కోసం జూరిస్డిక్షనల్ ఫ్రీజ్ అమలులో ఉన్న సమయంలో జీహెచ్ఎంసీ పునర్విభజన చట్ట విరుద్ధం అని పేర్కొంటూ జీవో నంబర్ 55ను దరం గురువ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేషన్ కుమార్ సింగ్ ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ తరపున వాదనలు వినిపించిన అడ్వొకేట్ రాజ్‌కుమార్ గుమ్మి.. జనగణన కార్యక్రమాల కోసం ఒకసారి జ్యూరిస్డిక్షన్ ఫ్రీజ్ ప్రకటించాక మున్సిపల్ సరిహద్దుల మార్పులు, స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణ అనుమతించబడవని కోర్టుకు దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి చర్యలు ప్రారంభం నుంచే చెల్లవని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని చట్ట విరుద్ధంగా, అధికార పరిధి లేకుండా జారీ చేసిన జీవో 55 ను రద్దు చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ తరపున వాదనలు విన్న న్యాయస్థానం కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్లు దాఖలైన అనంతరం ఈ కేసును తదుపరి విచాణకు కోర్టు తీసుకోనుంది. కాగా జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా విభజిస్తూ జీవో నంబర్ 55 ను ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

# అవినీతిని బయటపెడతాం..

- బీజేపీని అడ్డుకోవాలని చూస్తే మీ సంగతి చూస్తాం
- మంత్రుల అవినీతికి మధ్యవర్తులుగా కొందరు ఐఏఎస్ లు
- భాగ్యనగర్ ప్రజలు కాంగ్రెస్‌ను మూసీ లో పడేయడం ఖాయం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో పలు శాఖల మంత్రుల అవినీతిపై ఆధారాలు సేకరిస్తున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2029 నాటికి దేశంలోని ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పాలన ఉండదన్న ఆయన.. మంత్రి పదవులను అడ్డుపెట్టుకుని బరితెగించి బీజేపీని అడ్డుకోవాలని చూస్తే మీ సంగతి చూస్తామని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నేతలను ఇబ్బంది పెట్టిన మంత్రుల మెడలు వంచుతామన్నారు. మంత్రుల అవినీతికి కొందరు ఐఏఎస్ అధికారులే మధ్యవర్తులుగా ఉన్నారన్న బండి సంజయ్... అతి త్వరలో మంత్రుల కమీషన్ల చిట్టా, ఐఏఎస్ అధికారుల దందాలన్నీ బయటపెడతామన్నారు. 2029 తర్వాత 2047 వికసిత్ భారత్ లక్ష్యాలు నెరవేరేదాకా తెలంగాణలో బీజేపీ ప్రభుత్వమే కొనసాగుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌కు చెందిన 10 డివిజన్ కార్పొరేటర్ గురువారం నాంపల్లిలోనీ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో స్టేట్ చీఫ్ రామచందర్ రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)ని తెలంగాణ కరప్షన్, కమీషన్, కలెక్షన్, కాంగ్రెస్ (టీ4సీ) గా అభివర్ణించారు. భాగ్యనగర్‌లో కాంగ్రెస్‌ను మూసీ నదిలో పడేయడం ఖాయమన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భాగ్యనగర్ ప్రజలు కాంగ్రెస్ కు దిమ్మతిరిగేలా గుణపాఠం చెప్పబోతున్నారని జోస్యం చెప్పారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను రెండేళ్లలో చేసిందేమిటో చెప్పాలని నిలదీయాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు అప్పగించడానికే పరిమితమవుతున్నారే తప్ప తెలంగాణకు చేసిందేమిటో చెప్పాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెన్ ఫిట్స్ ఇవ్వకుండా వారి ఉసురు తీసుకుంటున్నారని ఇదేమిటని ప్రశ్నిస్తున్న వృద్ధులను జైల్లో వేయడానికి సిగ్గు లేదా? అని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ బీఆర్ఎస్ కలిసి పని చేశాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసిన కరీంనగర్ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ చెంప చెళ్లుమనిపించారన్నారు. సీఎం స్థాయి వ్యక్తులు కరీంనగర్ కార్పొరేషన్‌లో కుట్రలు చేశారని.. సభ్యులకు బ్లాంక్ చెక్కులు, కార్లు ఆఫర్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పెద్దలు, బీఆర్ఎస్ పెద్దలు ఈ కుట్రలో భాగమయ్యారని ధ్వజమెత్తారు.

**ఓవైసీ కళ్లలో ఆనందం కోసమే జీహెచ్ఎంసీ పునర్విభజన**

ఎంఐఎం అధినేత అసదొద్దీన్ ఓవైసీ కళ్లల్లో ఆనందం చూడటం కోసం సీఎం రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా, అఖిలపక్షం మీటింగ్ లేకుండా, ప్రజాప్రతినిధుల అభిప్రాయం లేకుండా ఏకపక్షంగా జీహెచ్ఎంసీని విభజించడం సిగ్గు చేటని మండిపడ్డారు. జీహెచ్ఎంసీని మూడు ముక్కలు ఎందుకు చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. జీహెచ్ఎంసీలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందన్న ఆయన బీజేపీకి భయపడే హిందూ సమాజ ఓట్లను చీల్చడానికే జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేశారని ఆరోపించారు. కోటిన్నర జనాభా కలిగి ఉండి 40 వేల కోట్ల బడ్జెట్ కలిగిన ముంబై కార్పొరేషన్ నే అక్కడి ప్రభుత్వం విభజించలేదని చెప్పారు. రెండు కోట్ల జనాభా కలిగిన ఢిల్లీని, చెన్నై కార్పొరేషన్ ను చీల్చలేదన్నారు. మరి జీహెచ్ఎంసీని ఏ ప్రాతిపదికన ముక్కలు చేశారని ప్రశ్నించారు. రెండేళ్ల పాలనలో జీహెచ్ఎంసీ పరిధిలో తట్ట మొరం పోసిన దాఖలాల్లేవన్నారు. భాగ్యనగర్ ప్రజలంతా తిరగబడే రోజులు రాబోతున్నాయని జోస్యం చెప్పారు. తెలంగాణ రైజింగ్ పేరుతో వచ్చిన రూ.5.75 లక్షల కోట్లు ఎటుపోయాయని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. వచ్చిన డబ్బుతో ఎంత మందికి ఉద్యోగాలిచ్చారు? ఎన్ని యూనిట్లు ప్రారంభించారు? సమాధానం చెప్పాలన్నారు. దావోస్ కు రెండు సార్లు వెళ్లి రూ.2.15 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్న విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పటి వరకు ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయని ప్రశ్నించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
20.02.2026 శుక్రవారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ 'ముద్ర' వేయండి
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# సింగపూర్ పాఠాలు... అందరికీ ఆదర్శం

ఒకప్పుడు అత్యంత దుర్భరమైన స్థితిలో, నిలువెల్లా అవినీతిలో కూరుకుపోయిన దేశం. ఎక్కడ చూసినా మురికివాడలు, తాగడానికి గుక్కెడు సురక్షితమైన నీరు దొరకని పరిస్థితి. అత్యంత కఠినమైన సమస్యలకు అడ్డాగా నిలిచిన ఆ దేశం నేడు యావత్ ప్రపంచానికి ఆదర్శవంతంగా మారింది. ఆ దేశమే, ప్రపంచంలో అత్యంత సుందరమైన దేశాలలో ఒకటిగా పేరొందిన సింగపూర్. కేవలం ఒకే ఒక్కడు... దాదాపుగా మూడు దశాబ్దాల పాటు దేశ ప్రధానిగా పనిచేసిన లీ క్యూన్ యూ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలకు ప్రతిఫలంగా నేడు ఆ దేశం ప్రపంచపటంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

202425 ఆర్థిక గణాంకాలను తీసుకుంటే... భారత దేశంలో సగటు ఆదాయం 2800 నుంచి 3000 యూఎస్ డాలర్లు వుంటే, సింగపూర్ తలసరి ఆదాయం 97,000 నుంచి 99,000 అమెరికన్ డాలర్లుగా ఉంది. ముఖ్యంగా అవినీతి రహిత దేశంగా మన గలగడం వల్లే సింగపూర్ ఈ స్థాయి ఆర్థిక ప్రగతి సాధించిందని స్పష్టంగా చెప్పవచ్చును. అవినీతి రహితంగా, అత్యంత పారదర్శకంగా సాగుతున్న సింగపూర్ వ్యవస్థ నుంచి తీసుకున్న పాఠాలనే వల్లె వేసిన చైనా కూడా అత్యంత పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను కలిగిన దేశంగా ప్రపంచస్థాయిలో పోటీ పడుతోంది.

## అవినీతి రహిత పాలనే ఆర్థిక ప్రగతికి మూలం

సింగపూర్, విస్తీర్ణం, జనాభాపరంగా అత్యంత చిన్నదేశమే కావచ్చును. 1965లో మలేసియా నుంచి విడివడి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించిన సింగపూర్ ఒక పెద్ద మురికివాడగానే చెప్పవచ్చును. అప్పట్లో అధికారులకు ఒక 20 డాలర్లు ఇస్తే సరి... విచ్చలవిడిగా జూదం నిర్వహణకు అనుమతులు దక్కేవి. ఈ దేశం మధ్యలో ప్రవహించే సింగపూర్ నది, కల్లాంగ్ నదులు పూర్తిస్థాయి మురికినీటి కాలువలను తలపించేవి. అలాంటిది నేడు ప్రపంచస్థాయిలో వాణిజ్య, పర్యాటక, వినోదాలకు పుట్టినిల్లుగా అత్యంత పరిశుభ్రమైన నీటితో ప్రవహిస్తూ అందరినీ అలరిస్తున్నాయి. అక్కడి మురికిప్రాంతాలన్నీ కూడా బహుళ అంతస్థుల నివాస భవనాలుగా రూపాంతరం చెందాయి. నేడు ఈ దేశం ప్రపంచస్థాయిలోనే పరిశుభ్రతకు మారుపేరుగా నిలిచింది. లీ క్యూన్ యూ తీసుకున్న అద్భుతమైన నిర్ణయాలు నేడు ఆ దేశానికి అంతర్జాతీయంగా ఒక గుర్తింపును తీసుకువచ్చాయనడంలో సందేహం లేదు. ఆయన తర్వాత వచ్చిన ప్రభుత్వాధినేతలు కూడా నాటి విధానాలనే కొనసాగిస్తుండంతో నేడు ప్రపంచంలోనే అవినీతి రహిత దేశాలలో ఒకటిగా సింగపూర్ అభివృద్ధిపథంలో పయనిస్తోంది.

## మనమెందుకు అవినీతి ఊబిలోనే వున్నాం?

భారత దేశ ప్రదానిగా నరేంద్ర మోదీ వచ్చేముందు, దేశంలో అవినీతిని సమూలంగా నాశనం చేస్తానని, విదేశాలలోనే నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రజల జీవన ప్రమాణాలను సుసంపన్నం చేస్తానని హామీ ఇచ్చారు. కానీ, ఏమీ కాలేదు. పత్రికల కథనాలను తీసుకుంటే, రోజూ ఎక్కడో ఒక చోట అవినీతికి పాల్పడుతున్న అధికారుల నుంచి నాయకుల వరకు వార్తలు కనిపిస్తూనే ఉన్నాయి. దేశంలో ట్రాఫిక్ పోలీసు నుంచి రాజకీయ నేతల వరకు లంచాలకు అలవాటు పడినవారే ఎక్కువగా ఉన్నారన్నది నిజం. కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్ (CPI)లో సింగపూర్ ఎల్లప్పుడూ అగ్రస్థానంలో ఉంటుంది. అవినీతి పరుల విషయంలో కఠిన చట్టాలు అమలులో ఉన్నాయి. అవినీతికి పాల్పడే అధికారులపై



కఠినమైన చర్యలు తీసుకోవడం ద్వారా పారదర్శకతను పెంచింది. అవినీతిరహిత వ్యవస్థను ప్రోత్సహించేలా పాలనాయంత్రాంగంలో అవినీతిని అరికట్టడానికి బలమైన వ్యవస్థాగత సంస్కరణలను అమలు చేసింది. ఎక్కడా అవినీతికి తావివ్వకపోవడంతో అంతర్జాతీయ వ్యాపార మరియు పెట్టుబడి కేంద్రంగా సింగపూర్ ఎదిగింది. ట్రాన్సపెరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ గణాంకాల మేరకు 180 దేశాలలో భారత్ 96వ స్థానంలో వుంది. అదే టాన్స్ పెరెన్సీ ఇంటర్నేషనల్ ఇండెక్స్ లో డెన్మార్క్, ఫిన్లాండ్ దేశాలతో పోటీగా మొదటి 2, 3 స్థానాలలో సింగపూర్ నిలుస్తోంది. వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ రూల్ ఆఫ్ లా గణాంకాల మేరకు భారత్ 142 దేశాలలో 79వ స్థానంలో ఉంటే, సింగపూర్ 3వ స్థానంలో ఉంది. ఆసియాపరిఫిక్ రీజియన్ లో అవినీతి రహిత మొదటి దేశంగా సింగపూర్ తన స్థానాన్ని పదిలపర్చుకుంది.

## వ్యవస్థలో లోపాలే అవినీతికి పునాదులు

ఈ గణాంకాలను కొట్టిపారేసిన వారూ లేకపోలేదు. అయితే, మన దేశంలో తీసుకుంటే... ఎన్నికల సమయంలో విచ్చలవిడిగా నగదు, మద్యంతో పాటు జనసమీకరణ, సోషల్ మీడియా పబ్లిసిటీ తదితరాలకు ఎంత ఖర్చవుతుందో అందరికీ తెలిసిందే. ఎన్నికల సమయంలో కోట్లు ఖర్చుచేసిన నాయకులు ఆ ఖర్చును తిరిగి పొందడానికి అడ్డదారులు తొక్కకుండా ఎలా వుండగలరన్నది ప్రశ్న. ముఖ్యంగా ఇదే మన వ్యవస్థలో పెద్ద లోపంగా అవినీతికి ఊతమిస్తోందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. 2018లో భారత్ లో ప్రివెన్సన్ ఆఫ్ కరెప్షన్ చట్టం సవరించారు. దీంట్లో సెక్షన్ 17ఏ ప్రకారం ఏ పబ్లిక్ సర్వెంట్ పైనా కూడా సీబీఐ నేరుగా కేసు నమోదు చేయడం గానీ, లేదా విచారణగాని చేయాలంటే ముందస్తుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సివుంది. నిజంగా నిజాయితీ పరులైన అధికారులకు ఈ సవరణ మేరకు మంచి జరుగుతుందనడంతో ఎంతమాత్రం సందేహం లేదు. అయితే, ఈ సవరణ రెండువైపులా పదునున్న కత్తిలా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదెలాగంటే.. ఒక రాష్ట్ర ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నఒక రాజకీయ నాయకుడిని లక్ష్యంగా చేసుకున్నపుడు, అతనిపై నేరుగా సీబీఐ విచారణకు అనుమతిని మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది. దీనిపై సీబీఐ ఆ నాయకుణ్ని లక్ష్యంగా చేసుకుని విచారణ జరపడానికి అవకాశం ఉంది. ఒకవేళ తమతో పాటు అధికారంలో వున్న ఒక నాయకుడిపై నేరుగా సీబీఐకి ఫిర్యాదు వెళ్లినా, ఆ వ్యక్తిపై విచారణకు సంబంధించిన ఫైలును ప్రభుత్వమే తొక్కిపెట్టే అవకాశం లేకపోలేదనే ఆరోపణలు ఉన్నాయి,. ఇక్కడ ప్రభుత్వ సమ్మతి లేకుండా ఆ అధికారి లేదా నాయకుడిపై సీబీఐ విచారణ కొనసాగించే అవకాశం లేదు. అలాగే ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని తీసుకుంటే... కొద్దికాలం క్రితం ఇండియన్ ఎక్స్ ప్రెస్ పత్రిక ప్రచురించిన ఒక ఇన్వెస్టిగేటివ్ కథనం మేరకు, 2014 నుంచి 2022 దాకా దేశంలో 121 మంది రాజకీయ ప్రముఖులపై ఈడీ కేసులు నమోదు చేసినపుడు వారిలో 115 మందిదాకా, అంటే దాదాపుగా 95 శాతం ప్రతిపక్షంలో వున్నవారే ఉండడం గమనార్హం. ఇక్కడ మనదేశంలో ఎవరిని విచారణ జరపాలన్నా కూడా అధికారంలో వున్న ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

సింగపూర్ లో నాటి ప్రధాని లీ క్యూన్ యూ అవినీతి భరతం పట్టడానికి కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (సీపీఐబీ) అనే ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు. నేరుగా ఆ దేశ ప్రధాని ఆధ్వర్యంలో ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఇందులోని అధికారులు ఒక వ్యక్తి అవినీతికి పాల్పడుతున్నట్టు గుర్తిస్తే, నేరుగా వారిని అరెస్టు చేసే అవకాశం ఉంది. ఇలా వీరు ఒక పారిశుద్ధ్య కార్మికుడి నుంచి ఒక క్యాబినెట్ మంత్రిదాకా కూడా వీరు అవినీతి ఆరోపణలపై అరెస్టు చేసే అవకాశం ఉంది. ఇక్కడ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని అరెస్టు చేయడానికి వారు ఏవిధమైన వారెంట్ కూడా తీసుకునే అవసరం లేదు. ఆదాయానికి మించిన ఆస్తులు వున్న వారు అక్కడి అదనపు ఆదాయానికి



బల్లెడ నాగేశ్వరరావు
సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాద్

తప్పనిసరిగా వివరణ ఇవ్వాల్సివుంది. మన దేశంలో ఆదాయానికి మించి ఆస్తులున్నట్టు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారిపై కేసులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. కానీ సింగపూర్ లో కేసులు మాత్రం 12 నెలలకు ముందే పరిష్కారమై నిందితుడికి శిక్ష ఖరారవుతుంది. సింగపూర్ లో 2019 నుంచి 2023లో సీపీఐబీ నమోదు చేసిన వాటిలో 99 శాతం కేసులు పరిష్కారమయ్యాయి. మన దేశంలో ఈడీ 2014 నుంచి నమోదు చేసిన 6,344 కేసులలో 0.9 శాతం కేసుల్లోనే నిందితులకు శిక్షలు ఖరారుకాగా, ఇంకా 99.1 శాతం కేసులు విచారణదశలోనే ఉన్నాయి. ఇలా తీసుకుంటే... ఇంకా చాలా కారణాలు చెప్పవచ్చును. మొత్తం మీద అత్యంత అవినీతిసహితమైన, దుర్భరమైన పరిస్థితులలోని నిరుపేద సింగపూర్ ను ఒకే ఒక్కడు లీ క్యూన్ యూ.... తన దూరదృష్టి, సునిశితమైన విధానాలతో ఒక సుసంపన్నమైన దేశంగా రూపొందించారు. ఇప్పుడు పర్యాటక, వాణిజ్య, భద్రత పరంగా అత్యంత పటిష్టమైన దేశాలలో ఒకటిగా భాసిల్లుతున్న సింగపూర్ విధానాలను అన్ని దేశాలు ఆదర్శంగా తీసుకుంటే, అవినీతి రహితంగా రూపొందించడంలో కృతకృత్యమవుతాయని ఆశిస్తున్నా.

# పరీక్షలు చదువులో అంతర్భాగమే!

పరీక్షల సమయంలో విద్యార్థులు అధిక ఒత్తిడికి లోనుకావడం సాధారణం భయం,ఆందోళన, నిద్రలేమి,ఏకాగ్రత తగ్గడం మరియు శారీరక నొప్పులకు దారితీస్తుంది. ప్రణాళికాబద్ధమైన అధ్యయనం, విశ్రాంతి,ఆరోగ్యకరమైన ఆహారం మరియు సానుకూల దృక్పథంతో ఈ ఒత్తిడిని అధిగమించవచ్చు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మద్దతు ఈ సమయంలో చాలా కీలకం. దేశ ప్రధాని నరేంద్ర మోదీ గారు విద్యార్థుల్లో పరీక్షల పై భయం,ఒత్తిడి తగ్గించాలనే ఉద్దేశ్యంతో పరీక్షా పే చర్చ అనే కార్యక్రమం ను చేపడుతున్నారు. 2025వ సంవత్సరం ముగిసింది. నూతన సంవత్సరం 2026 ప్రారంభమైనది. గత అనుభవాలను, ఫలితాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్లు, విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

నూతన సంవత్సరం ఆరంభంతో పాఠశాల విద్యాశాఖలో పదవతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకై ప్రత్యేక ప్రణాళికల రూపకల్పన వాటి అమలు హడావిడి మొదలైంది. జనవరి, ఫిబ్రవరి నెలలను దృష్టిలో పెట్టుకొని సెలవు దినాలను కూడా కలుపుకొని పిల్లలకు పునశ్చరణ తరగతుల నిర్వహణకై కార్యాచరణ ప్రణాళికలు విద్యాధికారుల ఆధ్వర్యంలో రూపొందించబడ్డాయి. పిల్లలకు పాఠాలు,చాప్టర్ల వారీగా పరీక్షల నిర్వహణ, వెనుకబడిన వారికి పునరభ్యసనం కల్పించడం, పిల్లలను పబ్లిక్ పరీక్షలకు సంసిద్ధం చేయడం ఈ ప్రణాళికల లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.అన్ని జిల్లాల్లో ఇంచుమించుగా ఇటువంటి ప్రణాళికలే అమలు చేయబడుతున్నాయి.ఈ క్రమంలో కొంతమంది విద్యాధికారులు ఒక్కడుగు ముందుకువేసి 100% ఫలితాలను సాధించాలని టీచర్లకు టార్గెట్లను విధిస్తున్నారు. ఆ ఫలితాలను సాధించకపోతే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ఇక కార్పోరేటు, ప్రైవేటు పాఠశాలల పరిస్థితి చూస్తే అక్కడ యాజమాన్యం ఉపాధ్యాయులకు 100% ఫలితాల సాధనతో పాటు అత్యధికంగా A1 గ్రేడులు, 10 GPA పాయింట్లు సాధించేలా చూడాలని ఆదేశాలిస్తున్నది. తద్వారా ఉపాధ్యాయులకు, పిల్లలకు అధికమైన ఒత్తిడిని కల్పిస్తున్నది. దీనికి తల్లిదండ్రుల తోడ్పాటు కూడా ఉండడం గమనార్హం.

ఈ పదవతరగతి విషయంలో విద్యాసంవత్సరం ప్రారంభం నుండే స్థానిక విద్యాధికారులు, పాఠశాల హెడ్మాస్టర్లు,ప్రైవేటు యాజమాన్యం అనేక నియమ నిబంధనలు విధిస్తారు. పదవతరగతి పిల్లలకు ఆటలుండవు.కొన్నిచోట్ల వాళ్ళు బడిలో జరిగే ఏ కార్యక్రమాల్లో పాల్గొనరాదనే నిబంధన పెడతారు. అట్లాగే టీ.వీ.లు చూడరాదని, సినిమాలకు,షికార్లకు వెళ్లరాదని, బంధువుల పెండ్లికి, వేడుకలకు వెళ్ళరాదని అంత అవసరమైతే తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఒక్కరోజు మాత్రమే వాడుకోవాలని సూచిస్తారు. చాలాచోట్ల ఉదయం,సాయంత్రం రెండుపూట్ల ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.ఉదయం ప్రార్థన సమయంలో కూడా పదవతరగతి పిల్లలు ప్రార్థనకు హాజరు కాకుండా స్పెషల్ క్లాసులోనే ఉండేలా ఆ సమయం కూడా చదువుకే వినియోగించుకోవాలని ఆదేశిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఈ నియమాలు మరింత కఠినంగా ఉంటాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో! మరెన్నో! ఇదిలా ఉంటే మరొక ప్రక్క సిలబను పూర్తిచేయడం, పిల్లలను రుబ్బడం. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (SCERT), అకడమిక్ క్యాలెండర్ ను రూపొందించి పదవతరగతిలో ప్రతి పాఠానికి, చాప్టరుకు అవసరమైన బోధనా పీరియడ్ల సంఖ్యను తెలుపుతూ జనవరి నెలలో సిలబస్ పూర్తికావాలని సూచించింది. విద్యాశాఖ రూపొందించిన క్యాలెండరును అధికారులే అతిక్రమించి నవంబరు, డిసెంబరు నెల్లోనే సిలబను పూర్తిచేయమని ఆదేశించడం గమనించాల్సిన అంశం. తామే విద్యావ్యవస్థను బాగు చేస్తున్న మేధావులమని భావించే కొంతమంది స్టేట్ రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో ఒక పాఠానికి, చాప్టరుకు ఇన్ని పీరియడ్లు అవసరమని ఇలాగే చెప్పాలని చెబుతూ ఇక్కడకు వచ్చేసరికి అధికారులకు వంత పాడడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనంగా కనిపిస్తుంది. గతంలో పబ్లిక్ పరీక్షలకు ముందు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం కొన్ని జిల్లాలో ప్రాక్టీస్ టెస్టుల పేరుతో పరీక్షలు నిర్వహించడం సంతోషం.కానీ ఆ రెండు పరీక్షల్లో పూర్తి సిలబస్ కాకుండా సిలబస్ ను విభజించి పరీక్షలు నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

పదవ తరగతిలో కనీస సామర్థ్యాలైన చదువడం, రాయడం రాని పిల్లలున్నారు. వారే రేపు ఫలితాలను తారుమారు చేయగలవారు. గతంలో అయితే పాఠ్య పుస్తకంలోనే ఉండే ప్రశ్నలు పరీక్షల్లో అడిగేవారు కాబట్టి ఈ పిల్లలకు ఆ ప్రశ్నలు జవాబులు బట్టి పట్టించి పరీక్షల్లో రాసేలా శిక్షణ ఇచ్చేవారు. కానీ ప్రస్తుత నిరంతర సమగ్ర ముల్యంకన పద్ధతిలో పరీక్షా విధానంలో పిల్లలే సొంతంగా రాయాల్సి ఉంటుంది. చదువడం రాయడం రాని పిల్లలు ఏం చదువుతారు ? ఏం అర్థం చేసు కుంటారు ? ఏం రాయగలుగుతారు? ఇట్లాంటి వారికొరకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని వారు కనీస అర్హత మార్కుల సాధనకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉంది.ఈ పిల్లలు ఆఖరుకు ఆబ్జెక్టివ్ పేపరు రాయాలన్నా చదువడం రావాలి గదా ! ఇటువంటి పిల్లలను పెట్టుకొని 100% ఫలితాల టార్గెట్టు పెట్టడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి.

ఇక ఈ విద్యాసంవత్సరాన్ని గమనిస్తే సర్పంచుల ఎన్నికలు, రాష్ట్ర జిల్లాస్థాయి వృత్యంతర శిక్షణలు,దసరా సెలవులు వీటన్నింటి కారణంగా పాఠశాల బోధనా పనిదినాలు బాగా తగ్గిపోయాయి.మళ్ళీ ఇప్పుడు MPTC,ZPTC ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.అదే జరిగితే మళ్లీ శిక్షణలు,ఎన్నికల విధుల నిర్వహణలో టీచర్లు బిజీ ఫలితాలపై ప్రభావం చూపుతుంది అనడంలో అతిశయోక్తి లేదు.టీచర్లకు బోధనేతర పనులను అప్పగిస్తూ బడికి దూరం చేస్తూ ఉన్న కొద్దిరోజుల్లోనే సిలబసు పూర్తి చేయమనడం, ఫలితాల టార్గెట్లను చేరుకోమని చెప్పడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వ పెద్దలే ఆలోచించాలి.

నిజానికి ఏ ఉపాధ్యాయుడు కూడా తన వద్ద చదువుతున్న పిల్లలు ఫెయిల్ కావాలని అనుకోడు. ముఖ్యంగా పదవ తరగతి పిల్లలపై విద్యాసంవత్సరం ప్రారంభం నుండే ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఏ అధికారి ఆదేశాలు ఇవ్వకపోయినా తామే సొంతంగా ఒక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేసుకుంటున్నారు. ఎవరూ చెప్పాల్సిన అవసరం లేకుండానే తామే నిర్ణయాలు తీసుకుంటున్నారు. పిల్లలను చదివిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రణాళికలు రూపొందించడం, ఆదేశాలు జారీ చేయడం, టీచర్ల పనితీరుపై నమ్మకం లేకనా? వారి చిత్తక శంకించడమా? లేదా వారిపై ఒత్తిడి పెంచడమా ?

పదవతరగతి ఫలితాల ఆధారంగా విద్యాధికారుల, ప్రధానోపాధ్యాయుల, టీచర్ల పనితీరును అంచనా వేయడం, ఫలితాలను సాధించిన పాఠశాల మంచి పాఠశాలగా, అక్కడి ఉపాధ్యాయులే ఉత్తమ ఉపాధ్యాయులని భావించడం వంటి ప్రభుత్వ ఆలోచనా విధానాలే ఈనాటి పరీక్షా ఫలితాల హల్చల్ కార్యక్రమాలు, ఈ ప్రణాళికల వల్ల కొంతమేరకు ప్రయోజనం ఉండవచ్చేమో కాని అంతకంటే ఎక్కువగా మానసిక ఆందోళన, ఒత్తిడిని కలిగిస్తుంది. అది వాస్తవం.

పరీక్షలు చదువులో అంతర్భాగంగా చూడకుండా పరీక్షల కొరకే చదువు అనే భావన కలిగించే మన విద్యావిధానమే ఈ ఒత్తిళ్ళకు ప్రధాన కారణం. దీనికితోడు ఇప్పుడున్న నిరంతర సమగ్ర మూల్యాంకన విధానంలో ఏ ప్రశ్నలు వస్తాయో, వాటికి జవాబులు ఎట్లా రాయాలో తెలియని పరిస్థితుల్లో పిల్లలు సతమతమవుతున్నారు. ఏ ప్రశ్నలు వస్తాయో ఉపాధ్యాయులే చెప్పలేని స్థితి. సహజంగానే పరీక్షలంటే కొంత ఆందోళన ఉంటుంది కాని ఈ విధానం వల్ల అది ఇంకాస్త ఎక్కువైంది. పిల్లల మానసిక పరిస్థితి, శక్తి సామర్థ్యాలు ఫలితాలపై ప్రభావం చూపుతాయి. కేవలం ఉపాధ్యాయులను దోషులను చేస్తూ ప్రకటన చేయడం వెనుక ఉద్దేశం ఏమిటో గ్రహించాలి. ఒకే ఉపాధ్యాయుడు అన్నిసార్లు 90% మేరకు ఫలితాలను తెప్పించలేడు. పిల్లలను బట్టి కూడా ఫలితాల శాతం మారు తుంటుంది. బాగా ఫలితాలు వచ్చినప్పుడు ఆ ఉపాధ్యాయుడు ఉత్తముడు ఫలితాలు తగ్గితే ఆ ఉపాధ్యాయుడే పనికి రానివాడు ఎట్లా అవుతాడు.

క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు దూరంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోకూడదు. ప్రతిదానికి టీచర్లను దోషులుగా చూపించే ప్రయత్నాలు మానుకోవాలని, పరీక్ష విధానాలలో మార్పులు తీసుకురావాలని, పిల్లలు కనీస సామర్థ్యాలు సాధించడానికై ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం పాలకులకు, అధికారులకు సూచిస్తుంది. దానికై అలుపెరుగని పోరాటం చేస్తున్నది.



సుధాకర్.ఏ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
9000674747

# పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి?!

ఇంటర్ పరీక్షలు ఆంధ్ర ప్రదేశ్ లో ఈ నెల 22 నుండి తెలంగాణ లో 25 నుండి ప్రారంభం కానున్నాయి పదవ తరగతి పరీక్షలు మార్చి లో నుండి ప్రారంభం కానున్నాయి పరీక్షల సీజన్ లో విద్యార్థులు పాటించ దగ్గ నియమాలు

- పరీక్షలు దగ్గరపడ్డాయి కావున మనస్సు ప్రశాంతంగా ఉంచుకోండి. ఆత్మవిశ్వాసం కోల్పోవద్దు. భయం, చిరాకు, నిరాశ, ఆందోళనలు ప్రక్కన పెట్టాలి.
- మీరు ఇన్ని రోజులు చదివారు, అభ్యసించారు, విన్నారు, కృషి చేసారు కావున మీదే విజయం అని పాజిటివ్ థింకింగ్ తో ఉండండి.
- సమయం వృదా చేయకుండా మంచి ప్లానుతో, పట్టుదలతో ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్లు ఎక్కువగా చదవండి.
- పరీక్షలకు వచ్చేటప్పుడు మరీ ఎక్కువగా లేక అస్సలు తినకుండా ఉండకండి. మితంగా తినండి (ఆయిల్ తక్కువగా ఉన్న టిఫిన్, ఆహారం తీసుకోండి) పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు, పండ్ల రసాలు శక్తితో నింపుతాయి. (5) మరీ ఇబ్బంది, బిగుతుగా ఉండే దుస్తులు ధరించకుండా, అనుకూలంగా ఉండే డ్రెస్సులు వేసుకోండి.
- మీరు కూర్చున్న స్థలంలో అనవసర కాగితాలు లేకుండా చూసుకోండి. కూర్చున్న తర్వాత ఐదు సార్లు శ్వాస గట్టిగా పిలుస్తూ వదులుతూ రిలాక్స్ అవ్వండి. ఇలా చేయడం వల్ల పరీక్ష రాసేంతవరకు ఎంతో ప్రశాంతంగా ఉంటారు.
- ప్రశ్నాపత్రము చేతికి రాగానే ప్రశ్నాపత్రాన్ని నిబంధనలతో పాటు చదవండి.
- ఏ ఏ ప్రశ్నలకు సమాధానాలు ఎలా వ్రాయాలో నిర్ణయించుకోండి. మీకు బాగా తెలిసిన సమాధానాలు చక్కగా మొదట వ్రాయండి.
- సమాధానాలు మధ్యలో గుర్తు రాకపోతే, మీరు ఆ ప్రశ్నకు సమాధానం చదివిన తీరు జ్ఞాపకం చేసుకోండి.
- మీరు రాసే సమాధానాలలో అందంగా, నీట్ గా, విషయవంతంగా ప్రజెంట్ చేయండి.
- మీరు వ్రాసే సమాధానాలలో హెడ్డింగ్స్, సబ్ హెడ్డింగ్స్ బాగా కనిపించేలా చేయండి (అవసరమైతే బ్లూ, బ్రౌన్, పింక్ స్కెచ్ లు ఉపయోగించండి. స్కెచ్ వాడకానికి అనుమతి ఉంటే). జామెంట్రీ బాక్స్ లో వస్తువులు, హాల్ టికెట్ తో పాటు ఆత్మవిశ్వాసం, ధైర్యం, పాజిటివ్ థింకింగ్ లను నింపుకోండి.
- మీకు సమాధానాలు తెలియని ప్రశ్నల వద్ద అనవసరంగా విలువైన కాలాన్ని వృధా చేయవద్దు. బాగా సమాధానాలు తెలిసిన వాటినే ముందుగా వ్రాయండి.
- జరిగిపోయిన పరీక్షల గురించి ఎట్టి పరిస్థితులలో ఆలోచించవద్దు.
- ఒక్క మార్కు, రెండు మార్కుల ప్రశ్నలకు చాలా దీర్ఘ సమాధానాలు వ్రాస్తూ సమయాన్ని వృధా చేయకండి.
- ప్రతిరోజు ఉదయం లేవగానే నేను పరీక్ష బాగా వ్రాస్తాను అని 7 సార్లు అనుకోండి.
- మీ విద్యా సంస్థ, పేరెంట్స్ ఫోన్ నెంబర్లు మీ దగ్గర ఉండటం వల్ల ఏదైనా సమస్య ఏర్పడితే వీరి సహాయం పొందవచ్చు
- ప్రశ్నాపత్రం, జవాబు పత్రం, కోడ్ సిస్టం లో దేనిగురించి అయినా అనుమానం వస్తే నిస్సందేహంగా ఇన్విజిలేటర్ ని అడగండి. ప్రశ్న నెంబర్ రాసి జవాబు రాయండి. ప్రశ్న మొత్తాన్ని వ్రాయవద్దు.
- సెల్ ఫోన్, స్లిప్స్, అనవసరమైన వస్తువులు తీసుకెళ్లవద్దు.
- పరీక్ష చివరి సమయం దాకా పరీక్ష హాల్లో ఉండండి.
- ఏదైనా ప్రశ్న, బిట్ తెలియకపోతే కొంతైనా వ్రాయడానికి ప్రయత్నించండి. అనుమానం ఉన్న ప్రశ్నకే చాయిస్ రాయండి. సమయం ఉంటే రాసిన దానిని సరిచూసుకోవచ్చు.
- విజయం మీ సొంతం అవుతుందని భావించండి. ఎందుకంటే దాని గురించే ఆలోచిస్తున్నారు కాబట్టి మనసును ప్రశాంతంగా పెట్టుకొని పరీక్ష రాస్తే మంచి మార్కులు సాధిస్తారు. ఆల్ ద బెస్ట్



కామిడి సతీష్ రెడ్డి
స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ) ములుగు పల్లి ఉన్నత పాఠశాల
జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా 9848445134

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
20.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews
5
దక్షిణ తెలంగాణ
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్
Hyderabad, Rangareddy, Mahabubnagar

**టాప్ 10 ఎన్ కౌంటర్స్**
గ్రేహౌండ్స్ బోటు ట్రాజెడీ తర్వాత ఆపరేషన్స్ (2008) ఒడిశాలో గ్రేహౌండ్స్ బోటు దాడి ఘటన తర్వాత ప్రతీకార చర్యలుగా భారీ కాంబింగ్ ఆపరేషన్స్ చేపట్టారు. ఈ నేపథ్యంలో అనేక ఎన్‌కౌంటర్లు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి.





## మూసి ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ ఆగ్రహం

- **భూముల సేకరణపై తీవ్ర అభ్యంతరం**
- **న్యాయం జరగకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిక**

**ముద్ర, బండ్లగూడ :**

మూసి అభివృద్ధి పేరుతో చేపడుతున్న ప్రాజెక్ట్ ప్రజలకు ఉపయోగం లేనిదని, కేవలం తమ ఆధ్వర్యంలో చేశామని చెప్పుకోవడానికే ఈ ప్రయత్నమని రాజేంద్రనగర్ బిఆర్ఎస్ ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి విమర్శించారు. బలవంతంగా భూములు సేకరించేందుకు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గాంధీ సరోవర్, మూసి అభివృద్ధి పనుల భాగంగా భూములు కోల్పోతున్న వారితో అధికారులు గురువారం హైదర్ గూడ, కిస్మత్‌పూర్ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు చట్టపరంగా భూసేకరణ జరుగుతోందని, భూములు మరియు ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం పలు రకాల నష్టపరిహారం చెల్లిస్తుందని తెలిపారు. ప్రాజెక్ట్ అమలు ద్వారా ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వివరించారు. అయితే సమావేశానికి హాజరైన పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అధికారులను నిలదీశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రజలకు అవసరమైన పనుల కోసం మాత్రమే భూములు సేకరించాలన్నారు. ట్యాంక్ బండ్ తరహాలో మూసి ప్రాజెక్ట్ కూడా ప్రజలకు పనికిరాని ప్రణాళికగా మారుతుందని విమర్శించారు. పూర్తి స్థాయి జలమట్టం(ఎఫ్‌టీఎల్) అనేది చెరువులకు వర్తిస్తుందని, నదులకు కాదని పేర్కొంటూ అధికారుల అవగాహనపై ప్రశ్నలు లేవనెత్తారు. మూసి నదికి ఇప్పటివరకు స్పష్టమైన రివర్ బెడ్ హద్దులు కూడా లేవని గుర్తుచేశారు. పిల్లల భవిష్యత్తు కోసం దాచుకున్న భూములు, అప్పులు చేసి నిర్మించుకున్న ఇళ్లను ప్రభుత్వం లాక్కోవడం సరికాదన్నారు. ప్రజలకు సరైన న్యాయం జరగకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకట్ రెడ్డి, డీఎంసీ సురేందర్ రెడ్డి, నాయకులు నాగరాజు, రవీందర్ రెడ్డి, ప్రేమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్

**ముద్ర, తాండూర్ :**

వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలోని పార్కులను సుందరంగా మార్చాలని నూతన మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్రెడ్డి అధికారులకు సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గా ప్రమాణస్వీకారం చేసిన మొదటిసారి పట్టణంలోని 28వ వార్డు శాంతినగర్ లోని పార్కును మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి మరియు వార్డ్ కౌన్సిలర్ నాగారం మల్లేశంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్కులో పేరుకపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని, మురుగు కాల్వలను శుభ్రంచేసి, పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని ఆమె ఆదేశించారు. చైర్మన్తోపాటు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్ నాగారం మల్లేశం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- **బిఆర్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణయ్య**

ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :ల వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన తొమ్మిది నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని బిఆర్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు టైగర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిర్లక్షం చేస్తున్న కాంట్రాక్టర్ లేబర్ లైసెన్స్ ను వెంటనే రద్దు చేసి, బ్లాక్ లిస్టులో పెట్టాలని కృష్ణయ్య జిల్లా కార్మిక శాఖా అధికారులను డిమాండ్ చేశారు. తొమ్మిది నెలల నుంచి కాంట్రాక్టర్ కార్మికులకు జీతాలు చెల్లించకుంటే వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రెగ్యులర్గా కాంట్రాక్టర్ జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్, డబ్బులు చెల్లిస్తున్నారా? లేదా? అని చూసుకోవాల్సిన బాధ్యత కాలేజ్ ప్రిన్సిపాల్ పై ఉంటుందని కృష్ణయ్య గుర్తు చేశారు. వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని, లేదంటే బిఆర్టీయు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని కృష్ణయ్య హెచ్చరించారు.

## కళాశాల భవనం పై నుండి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**ముద్ర, బండ్లగూడ :**



కళాశాల భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే శివరాంపల్లిలో నివాసముండే రితిక అనే విద్యార్థిని భవాని కాలనీలో శ్రీ వైష్ణవి బాలికల కళాశాలలో బైపిసి రెండో సంవత్సరం చదువుతోంది. కళాశాల మూడో అంతస్తు నుంచి గురువారం సాయంత్రం దూకి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన స్థానికులు, కళాశాల నిర్వాహకులు తీవ్ర గాయాలకు గురైన రితికను స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుడిమల్కాపూర్ లోని ఆసుపత్రికి తరలించారు. అయితే అదే సమయంలో కళాశాల చుట్టూ కొందరు యువకులు పిడిగుద్దులు గుద్దుకుంటూ హంగామా చేశారు. ఈ గ్యాంగ్ వార్ కు విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి ఏవైనా సంబంధాలు ఉన్నాయని కోణాల్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక పరిస్థితి విషమంగా ఉందని 48గంటలు గడిస్తే కానీ ఆమె పరిస్థితి చెప్పలేమని వైద్యులు తెలిపారు.



వికారాబాద్లో..



తాండూర్లో..

# ఘనంగా ఛత్రపతి జయంతి..

**ముద్ర, మల్కాజిగిరి :**

భారతదేశంలో హైందవ ధర్మాన్ని కాపాడేందుకు చత్రపతి శివాజీ చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. సామ్రాట్ శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మునీరాబాద్లోని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ మొగలాయి చక్రవర్తుల దౌర్జన్యాలు దుర్మార్గాలు ఎదిరించిన ధీరుడు. పరాయి పాలకులు భారత ప్రజల ప్రాణమానాలను హరిస్తున్న సమయంలో భారత జాతిని కాపాడటంలో ఆయన చేసిన త్యాగం యుద్ధం వింటుంటే రోమాలు నిక్కబొడుస్తాయని అన్నారు. శివాజీ మహారాజ్ చరిత్ర శాశ్వతంగా ఉండాలని, వచ్చే తరాలు ఆ చరిత్రను మననం చేసుకోవాలని శ్రీశైలంలో ఆయన స్ఫూర్తి కేంద్రం గొప్పగా ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. అది మన తెలుగు రాష్ట్రాలలో ఉండడం గర్వకారణమని ఈటల రాజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి మల్లికా, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.అదేవిధంగా మారుతీ నగర్ శివాజీ పార్క్ వద్ద శివాజీ విగ్రహానికి మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చత్రపతి శివాజీ పోరాట పటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతోపాటు పలువురు యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**వికారాబాద్లో..**

ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి : హిందూ స్వరాజ్య స్థాపకుడు, ధైర్యసాహసాల ప్రతీక అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని వికారాబాద్ మండలం, గొట్టిముక్కుల గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సధానంద రెడ్డి, వికారాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దింటి నవీన్ కుమార్, పార్లమెంటరీ ఇన్‌చార్జ్ అమరేందర్ రెడ్డి, పెద్దింటి శ్రీకాంత్, ఛత్రపతి శివాజీ యువత నాయకులు నరేష్, యాదయ్య, సాయిబాబా, హరిగౌడ్, మోహన్, రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సధానంద రెడ్డి మాట్లాడుతూ శివాజీ మహారాజ్ చూపిన ధైర్యం, స్వాభిమానం, దేశభక్తి మార్గం ప్రతి భారతీయుడికి ఆదర్శమన్నారు. గ్రామస్థులు, శివాజీ యువత సభ్యులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**తాండూర్లో..**

ముద్ర, తాండూర్ : తాండూర్ మున్సిపల్ పరిధిలోని సాయిపూర్లో శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలవేసి మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజబాల్ రెడ్డి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శివాజీ మహారాజ్ హిందువుల స్ఫూర్తి ప్రదాత, వీరత్వానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ శివాజీ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల బాల్రెడ్డి, సీనియర్ నాయకులు బంటు మల్లప్ప, తాండ్ర రాకేష్, సాయిపూర్ వాసులు, యువకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తాండూర్ పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. పార్టీలకతీతంగా అన్ని హిందూ సంఘాల నాయకులు బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని, హిందూ కేంద్ర సమితి తదితర హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున కాళిక దేవి ప్రాంగణం నుండి వినాయక్ చౌక్, ఇందిరా చౌక్, పురవీధుల గుండా చత్రపతి శివాజీ మహారాజ్ కి జై అంటూ నినాదాలు చేస్తూ భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

**కూకట్‌పల్లిలో..**

హైదరాబాద్ (కూకట్‌పల్లి) : ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలు కులమతాలకు, ప్రాంతాలకు అతీతమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బాలానగర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. బాలానగర్‌కు చెందిన జై శ్రీరామ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్, తొలుత శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో బండి రమేష్ మాట్లాడుతూ.. భారతదేశ చరిత్రలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఛత్రపతి శివాజీ చేసిన పోరాటం చూపిన ధైర్యం సాహసం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు, శివాజీ అభిమానులు పాల్గొన్నారు. అదేవిధంగా ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా కేపీహెచ్బీ రోడ్ నెం1 లోని శివాజీ మహారాజ్ విగ్రహానికి హౌసింగ్‌బోర్డ్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, శివాజీ అభిమానులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో..

**రక్తదానం ప్రాణదానంతో సమానం**

చత్రపతి ధర్మరక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షులు కర్ర వేణుగోపాల్ ఆహ్వానం మేరకు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలలో భాగంగా మూసాపేట్, గూడ్స్ షెడ్ రోడ్ పినాకిల్ క్యాంపస్లో జరిగిన రక్తదాన శిబిరానికి ప్రత్యేక అతిథిగా జనసేన రాష్ట్ర నాయకులు కూకట్పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ తల సేమియా సికిల్ సెల్ సొసైటీ డైరెక్టర్ రత్నావళి , వై శ్రీదేవి విచ్చేసి ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్ర పటానికి పుష్పమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు, రక్త దానం చేసిన యువతకు సర్టిఫికెట్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా భవనాల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

- **కలెక్టర్ ప్రతీక్ జైన్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

పాఠశాలలు, స్వయం సహాయక సంఘాల భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం అన్ని మండలాల ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో కంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి మహిళల సాధికారతకు తోడ్పడే స్వయం సహాయక సంఘాల భవన నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మన ఊరుమన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో తరగతి గదులు, శౌచాలయాలు, తాగునీటి సదుపాయాలు, కాంపౌండ్ వాల్స్ వంటి మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలనీ ఆదేశించారు. విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఈ నిర్మాణాలు చేపట్టాలని, అన్ని సౌకర్యాలు కలిపించడం వల్ల పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగడంతోపాటు, తల్లిదండ్రుల్లో విశ్వాసం మరింత బలపడుతుందని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించేందుకు స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భవనాలలో సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఆదాయ ఉపాధి కార్యకలాపాలకు ఉపయోగపడనున్నాయన్నారు. నిధులు మంజూరై మొదలుపెట్టని భవన నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. అధికారుల సమన్వయంతో పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పనుల పురోగతి పై మండలం వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా పంచాయతి అధికారి జయసుధ, జిల్లా విద్యా శాఖాధికారి రేణుకా దేవి, పంచాయతి రాజ్ ఈఈ ఉమేష్ కుమార్, అన్ని మండలాల ఎంపిడిఓలు, ఎంపిఓలు తదితరులు పాల్గొన్నారు.




**రైతు బజారులో మౌలిక కల్పనకు కృషి..**

రైతుల సౌకర్యార్థం రైతు బజారులో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని రైతు బజారును ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా రైతులు, విక్రయదారులతో రైతు బజారులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి, వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని కనీస వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. రైతుబజారులో టాయిలెట్లు, షెడ్ల ఏర్పాటుతోపాటు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. వర్షపు నీరు రైతు బజార్లోకి రాకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కలెక్టర్ తోపాటు అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్. అర్థ సుధాకర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మచ్చ బొల్లారం ఆర్‌యుబి వెంటనే చేపట్టాలి

**ముద్ర, మల్కాజిగిరి :**

ట్రాఫిక్ రద్దీతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు రైల్వే అధికారులు వెంటనే ఆర్‌యుబి నిర్మాణం చేపట్టాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశించారు. మచ్చ బొల్లారం ఆర్‌యుబి నిర్మాణంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మచ్చ బొల్లారం రైల్వే గేటు వద్ద తరచుగా ఏర్పడుతున్న ట్రాఫిక్ రద్దీ, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్‌యుబి నిర్మాణం అత్యవసరమన్నారు. ఆర్‌యుబి నిర్మాణం పూర్తయితే సమయభావం తగ్గి, ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పడుతాయని తెలిపారు. భూసేకరణ, సర్వే, సాంకేతిక అంశాలు, శాఖల సమన్వయం విషయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. పనులు వేగవంతంగా ప్రారంభమయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రైల్వే ల్యాండ్ ఆక్విజిషన్ అధికారి శేషాచారి, రైల్వే సెక్షన్ ఇంజనీర్ సామ్రాట్ రాయ్, అల్వాల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్లు, అల్వాల్ డిప్యూటీ తహసీల్దార్ పృథ్వి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
20.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### టాప్ 10 ఎన్ కౌంటర్స్

సిమి అనుమానితుల ఎన్‌కౌంటర్, నల్లగొండ (2008)
సిమి అనుమానితులపై నల్లగొండలో జరిగిన ఎన్‌కౌంటర్ పెద్ద వివాదానికి దారి తీసింది. పోలీసులు నిజమైన ఎన్‌కౌంటర్ అంటుండగా, కుటుంబాలు ఫేక్ అంటూ ఆరోపించాయి.





## సూపర్ టాలెంటెడ్ కిడ్’ కు కలెక్టర్ అభినందనలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన సౌజన్య, రాకేశ్ దంపతుల కుమారుడు కేవలం 19 నెలల వయసులోనే 50 మీటర్ల దూరాన్ని 36 సెకన్లలో పూర్తి చేసి అరుదైన ప్రతిభను చాటుకున్నాడు. ఈ అసాధారణ ప్రతిభకు గాను బాలుడు నోబుల్ వరల్డ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థల నుండి ‘సూపర్ టాలెంటెడ్ కిడ్’ అవార్డులు అందుకున్నాడు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బాలుడిని, తల్లిదండ్రులను అభినందించారు. శాలువాతో సన్మానించి, మెడల్స్, సర్టిఫికెట్లు సాధించడం జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా బాలుడిని ప్రోత్సహించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తన ఛాంబలో బాలుడికి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## అంగన్ వాడీలు మెరుగైన సేవలు అందించాలి

- **మేయర్ కొలగాని శ్రీనివాస్**

**ముద్ర, కరీంనగర్:**

అంగన్ వాడీలు మెరుగైన సేవలు అందించాలని, వారి సేవలు ప్రస్తుతం సమాజంలో కీలకంగా మారాయని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఐసిడిఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గురువారంకోతి రాంపూర్ పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ మాట్లాడుతూ ఆరు సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, పౌష్టికాహారం, ముందస్తు విద్య, ఆరోగ్య తనిఖీలు, టీకాలు వంటి ఎన్నో ముఖ్యమైన సేవలు అంగన్ వాడీల ద్వారానే అందుతున్నాయన్నారు. గర్భిణీలు బాలింతలకు అవసరమైన పోషకాహారం తో పాటు పిల్లల పెరుగుదల, ఆరోగ్య పటిష్టత కోసం అందించే బాలామృతం, కోడిగుడ్లను సక్రమంగా అందించాల్సిన బాధ్యత అంగన్వాడీ టీచర్లపై ఉందన్నారు. ముఖ్యంగా పేద పిల్లలు, పేద మహిళలకు అంగన్వాడీ పరిధిలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాసం గణేష్, పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, డిడబ్ల్యు ఆఫీసర్ సరస్వతి, సిడిపిఓ ఆఫీసర్ సబితల తో పాటు ఐసిడిసిఎస్ సూపర్వైజర్లు, అంగన్ వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## డైవర్ట్ పాలిటిక్స్ ‘బండి’కి వెన్నతో పెట్టిన విద్య

- **బీఆర్ఎస్ తో రహస్య ఒప్పందం పెట్టుకుని కాంగ్రెస్ పై నిందలా**
- **ఇప్పటికైనా కరీంనగర్ ప్రజల అభివృద్ధి కోసం ఆలోచించండి**
- **విలేకరుల సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**ముద్ర, కరీంనగర్:**

డైవర్ట్ పాలిటిక్స్,డ్రామా పాలిటిక్స్ కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు వెన్న తో పెట్టిన విద్య అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, గంట శ్రీనివాస్, వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి లతో కలిసి ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ బీఆర్ఎస్ తో రహస్య ఒప్పందం చేసుకొని ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లతో క్యాంపు పెట్టుకుంటే ఆగమేఘాల మీద ఇండిపెండెంట్ లకు బీజేపీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీని బదనాం చేసే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కరీంనగర్ ప్రజలు బీజేపీ ఎంపీని, ఎమ్మెల్సీని, మేయర్ ను గెలిపించారని, ఇప్పటి వరకు బండి సంజయ్ కుమార్ కరీంనగర్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా చేస్తామని అనేక హామీలు ఇచ్చారని వాటన్నిటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా చిత్తశుద్ధితో పని చేస్తుందని అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు పరస్తుందని ఇంకా మిగిలిపోయిన పథకాలు అమలు చేస్తామని అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. ఇప్పటికైనా విజ్ఞులైన ప్రజలు బీజేపీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎండి చాంద్, ఎండి లయక్, ముల్కల కవిత, జ్యోతిరెడ్డి, వీర దేవేందర్, బషీర్, భారీ, కీర్తి కుమార్, హనీఫ్, ఫజల్, జమీల్, యోనా, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- **ప్రతివారం ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించాలి**
- **జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**ముద్ర, కరీంనగర్:**





వచ్చే నెల 14 నుండి పదవ తరగతి పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో విద్యార్థులపై ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండల విద్యాధికారులు, ప్రత్యేక అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న నెల రోజులు పదో తరగతి విద్యార్థులకు చాలా కీలకమని అన్నారు. అందువల్ల ప్రతి వారం ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన పాఠశాలలను విధిగా సందర్శించి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రానున్న నెల రోజులపాటు ఉపాధ్యాయులకు, విద్యాశాఖ సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని, అత్యవసరమైతే వారి స్థానంలో మరొకరికి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా ప్రత్యేక తరగతులకు, పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడాలని అన్నారు. హాస్టల్లో ఉండే విద్యార్థులను అత్యవసరమైతే తప్ప ఇంటికి వెళ్లేందుకు అనుమతించకూడదని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తూ ప్రత్యేక తరగతులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను ఎలా సిద్ధం చేస్తున్నారో ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ఇప్పటికే రెండు మోడల్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఆ పరీక్షల ప్రగతి నివేదిక ప్రకారం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వంద శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని విద్యాధికారులను ఆదేశించారు.

**‘పీఎం శ్రీ’ పెండింగ్ బిల్లులపై సమీక్ష**

జిల్లాలో పీఎం శ్రీ కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల్లో పెండింగ్ బిల్లుల అంశంపై విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ట్రెజరీ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడితో కలిసి సమీక్షించారు. వేతన బిల్లులు మినహా అన్ని రకాల చెల్లింపులు వెనువెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సబ్ ట్రెజరీ అధికారులు ప్రధానోపాధ్యాయులు సమర్పించిన బిల్లులను వెంటనే ఆడిట్ చేసి ఆమోదం కోసం పంపించాలని అన్నారు. వివిధ పాఠశాలల్లో వాననీటి సంరక్షణ గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, ఆంజనేయులు, పాఠశాలల ప్రత్యేక అధికారులు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.





## డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్ ల తనిఖీ

**ముద్ర, కరీంనగర్:**

గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ అథారిటీ తనఖీ బృంద సభ్యులతో కలిసి కరీంనగర్ పట్టణంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్ లు, అల్ట్రా సౌండ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, పేషెంట్ అనుమతి పత్రాలు, కేస్ రికార్డ్స్, సంబంధిత డాక్యుమెంట్లను తనిఖీ చేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ (లింగ ఎంపిక నిషేధం) చట్టం1994, నిబంధనలు1996 ప్రకారము మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్నిప్రైవేటు హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ మరియు నియంత్రణ) చట్టం 2010ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలన్నారు. లేనిచో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అట్టి ఆస్పత్రులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయా ఆసుపత్రులకు సంబంధించిన డాక్టర్ల క్వాలిఫికేషన్ల ఒరిజినల్ సర్టిఫికెట్లను, ప్రత్యేక వైద్య నిపుణులు గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, ఇతర క్వాలిఫైడ్ స్పెషలిస్టుల ఒరిజినల్ సర్టిఫికెట్స్, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ డాకుమెంట్స్ ను పరిశీలించారు. నర్సింగ్ హోమ్ లలో మొదటి కాన్పుకు వస్తున్న గర్భవతులను సాధారణ డెలివరీకి ప్రోత్సహించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధ, పిఓ డిటిటి డాక్టర్ ఉమాశ్రీ, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, బాలయ్య, ఇజాక్ పాల్గొన్నారు.

**కేశపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓ డిటిటి డాక్టర్ ఉమాశ్రీ లు గురువారం కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, ఎన్ సి డి రిజిస్టర్, ఫార్మసీ స్టోర్స్, పిల్లల వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్ కు సంబంధించి రోజువారి టెంపరేచర్ రికార్డుల నమోదును పరిశీలించారు. వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న అవుట్ పేషంట్లతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పీహెచ్సీ డెలివరీలను ఇంప్రూవ్ చేయాలన్నారు. గర్భవతుల చెకప్స్, అభా కార్డుల క్రియేషన్ సంఖ్యను పెంచాలన్నారు 13 సం,,ల వయస్సు పైబడిన వారందరికీ, ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ చేసిన అందరిని రీస్క్రీనింగ్ చేస్తూ ఫాలోఅప్ చేయాలన్నారు. ప్రసూతి గది పరిశుభ్రతను, అందులో ఉండాల్సిన ప్రోటోకాల్ చార్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ సంధ్యారాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## యువతకు స్ఫూర్తి ఛత్రపతి శివాజీ

- **ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నేటి యువత ఛత్రపతి శివాజీ మహారాజ్ ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఉద్బోధించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మలక్ చించోలిలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సనాతన ధర్మ రక్షణకు శివాజీ మహారాజ్ చేసిన సేవ చిరస్మరణీయమన్నారు. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన హిందూ ధర్మ రక్షకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ ను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షుడు నరేష్, నాయకుడు అంబటి గంగాధర్, మాజీ ఎంపీటీసీ కొరిపెల్లి రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సనాతన ధర్మ సారథి ఛత్రపతి శివాజీ

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

భారతీయ సంస్కృతిని నేటి తరాలకు అందించిన సనాతన ధర్మ సారథి ఛత్రపతి శివాజీ అని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ కొనియాడారు. శివాజీ జయంతి సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో శివాజీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు, శివాజీ ఉత్సవ సమితి సభ్యులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన 10వ డివిజన్ కార్పొరేటర్

**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ నుంచి గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి సౌగాని కొమురయ్య యాదవ్ గురువారం బీజేపీలో చేరారు. హైదరాబాద్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు పాల్గొన్నారు. అనంతరం సౌగాని కొమురయ్య యాదవ్ మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసమే బీజేపీలో చేరినట్లు వెల్లడించారు.



## రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు బయలుదేరిన క్రీడాకారులు

**ముద్ర, కరీంనగర్:**

ఈ నెల 15 నుండి 20 వరకు జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కరీంనగర్ జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు బయలుదేరారు. 43 క్రీడాంశాలలో జరుగుతున్న పోటీలలో వీరు ప్రతిభ కనబరచనున్నారు. ఫుట్ బాల్, స్విమ్మింగ్, హాకీ, టేబుల్ టెన్నిస్, సాఫ్ట్ బాల్ మొదలైనవి గచ్చిబౌలి, నెట్ బాల్, బాక్సింగ్ మహబూబ్ నగర్, అథ్లెటిక్స్ హనుమకొండ, హ్యాండ్ బాల్ ఎల్బీ స్టేడియం, యోగ రంగారెడ్డి, ఖోఖో నల్గొండ, కబడ్డీ నారాయణపేట, బాస్కెట్బాల్ నిజామాబాద్, సెపక్ తక్రా వనపర్తి జిల్లాలలో సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రీడాంశాలలో ప్రతిభ కనబరిచి జిల్లాకి పేరు తేవాలని జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
20.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**చింతగుఫా-బీజాపూర్ సరిహద్దు ఆపరేషన్స్ (2010ల ప్రారంభం)**



తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టులపై సంయుక్త దళాలు చర్యలు చేపట్టాయి. పలువురు కీలక క్యాడర్లు ఎన్‌కౌంటర్లలో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.



## తాజ్ పూర్ లో ప్రత్యేక హెల్త్ క్యాంప్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపడుతున్న యాక్టివ్ కేస్ ఫైండింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇటీవల డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ లో ఈ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా నోడల్ అధికారి డీటీసీఓ డాక్టర్ వంశీకృష్ణ హాజరై గ్రామ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. క్యాంప్‌లో భాగంగా గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో ఆరోగ్య శిబిరం నిర్వహించిన వైద్య బృందానికి, సహకరించిన గ్రామ పంచాయతీ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ స్థాయిలో ముందస్తు పరీక్షలు పెంచితే అనేక రోగాలను ప్రారంభ దశలోనే నియంత్రించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రభుత్వ వైద్య బృందం, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నార్మల్ డెలివరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- **భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

జిల్లాలో నార్మల్ డెలివరీలు పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏఎన్ఎంలకు జిల్లా కలెక్టర్ హనుమంత రావు సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అర్మాన్ ట్రైనింగ్ బృందం ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు హై-రిస్క్ గర్భిణీ ట్రాకింగ్, నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గర్భిణి స్త్రీని గర్భధారణ మొదటి నెల నుంచే నమోదు చేసి, ఆమె ఆరోగ్య పరిస్థితిపై పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. హై-రిస్క్ గర్భిణీ కేసులను ముందుగానే గుర్తించి, క్రమం తప్పకుండా ట్రాక్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పల్లె దవాఖానల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల కొంతమంది గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రులకు రాకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారని, అక్కడ అవసరం లేకపోయినా భయపెట్టి సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్న సందర్భాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనవసర సిజేరియన్ ఆపరేషన్లను అరికట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉందని, వైద్యులు నార్మల్ డెలివరీలు జరిగేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య




శాఖాధికారి డా.ఎం.మనోహర్ మాట్లాడుతూ.., అన్ని ఎంపీహెచ్ఏ (ఎఫ్)లకు హై-రిస్క్ గర్భిణీ ప్రోటోకాల్స్ ప్రాముఖ్యతను వివరించారు. హై-రిస్క్ గర్భిణీ కేసులను తొందరగా గుర్తించడం ద్వారా వారికి సమయానుకూలంగా మెరుగైన చికిత్స అందించవచ్చని తెలిపారు. అర్మాన్ ట్రైనింగ్ బృందం, హైదరాబాద్‌కు చెందిన ట్రైనర్స్ డా. భవాని మరియు డా. రోహిణి హై-రిస్క్ గర్భిణీ ప్రోటోకాల్స్‌పై సవివరంగా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లు యశోద, రామకృష్ణ, వీణ, వంశీ కృష్ణ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- **భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

పీఎం శ్రీ నిధుల నుండి మంజూరు చేయబడిన పాఠశాలల్లో సివిల్ వర్క్స్ పనులను పెండింగ్ లేకుండా మార్చి, 15 వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మినీ మీటింగ్ హాల్ లో పీఎం శ్రీ పథకంలో చేపట్టిన పనులను ఎంత మేరకు పూర్తి చేశారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, అదనపు తరగతి గదులు, లైబ్రరీ గదుల నిర్మాణం గురించి మంజూరైన నిధులను పాఠశాలలలో ఉన్న పనులను పూర్తి చేయాలని, పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. కోటమర్తి, మల్లాపూర్, భువనగిరి గంజ్ పాఠశాలలలో సమస్యలను గుర్తించి, ఇంజనీర్ వాటిని నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించేలా చూడాలని కలెక్టర్ ఇంజనీర్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాల ప్రసాద్, డివిజనల్ ఇంజనీర్ శివకుమార్, ప్రధానోపాధ్యాయులు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ధ్యేయం

- **ఎమ్మెల్యే మందుల శామ్యూల్**

**ముద్ర, తుంగతుర్తి:**



రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, వ్యవసాయ రంగంలో ప్రస్తుతం ఆధునిక టెక్నాలజీకి సంబంధించి యంత్రాల ఉపయోగం పెరిగిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ అన్నారు. సూర్యాపేట జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మందుల శామ్యూల్ హాజరయ్యారు. ఆరు మండలాలకు సంబంధించి అర్హులైన 124 మందికి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా వ్యవసాయం యంత్రాల పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన వారికి ప్రభుత్వం తరఫున సబ్సిడీలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా వివిధ రకాల పనిముట్లను అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏడిఏ రమేష్ బాబు, ఎంపీడీవో శేషు కుమార్, డిప్యూటీ తహసిల్దార్ కంఠమయ్య, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న,తుంగతుర్తి గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, మద్దిరాల, నాగారం, నూతనకల్, అర్వపల్లి మండలాల అగ్రికల్చర్ అధికారులు అనిషా, కృష్ణ కాంత్, గణేష్, ఆయా మండలాల ఏఈఓలు, తూర్పు గూడెం, సంగెం సర్పంచులు దాసరి రేణుక శ్రీనివాస్, కలకొట్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## ధీరత్వానికి మారుపేరు శివాజీ

**ముద్ర, ఆత్మకూర్ (ఎం):**

చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఆత్మకూరు మండలం కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి మాట్లాడుతూ.. భారత ముద్దుబిడ్డ, ధైర్యానికి, దేశభక్తికి, ధీరత్వానికి చత్రపతి శివాజీ మారుపేరుగా నిలిచారని ఆమె అన్నారు .ఆత్మకూరులో గల శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శివాజీ యువజన మండలి అధ్యక్ష కార్యదర్శులు మజ్జిగ నరేష్ ,తొండల అనిల్ కుమార్ గౌడ్ మాజీ ,అధ్యక్షుడు కోర మల్లేష్ ,మాజీ ఎంపీటీసీ యాస కవిత, మాజీ సర్పంచులు జన్నాయి కోడె నగేష్, బిసు చందర్గౌడ్ యాస లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ ,బిజెపి పట్టణ అధ్యక్షులు పోతగాని మల్లేష్ గౌడ్, సిపిఐ ,సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శులు మజ్జిగ నరసయ్య , రాచమల్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్ విడుదల చేయాలి

**ముద్ర ప్రతినిధి, బీబీనగర్:**

మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అరెస్టు అక్రమమని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేష్ తీవ్రంగా ఖండించారు. వందల మంది పోలీసులను పెట్టి క్యాతనపల్లిలో మంత్రి వివేక్ చేస్తున్న అరాచకాలను, ఎన్నికల అక్రమాలను ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను అరెస్టు చేయడం దారుణ మన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ మార్కు కబ్జా రాజకీయం నడుస్తోందన్నారు. బాల్క సుమన్ ను వెంటనే విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని నగేష్ హెచ్చరించారు.

## హిందూ వాహిని ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి పురస్కరించుకొని గురువారం హిందూ వాహిని జిల్లా, పట్టణ శాఖ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర స్థానిక హనుమాన్ వాడ నుండి ప్రారంభమై భువనగిరి పుర వీధుల్లో తిరుగుతూ నల్లగొండ చౌరస్తా శివాజీ విగ్రహం వరకు సాగింది. ఈ శోభాయాత్రలో వాహిని తెలంగాణ ప్రాంత కమిటీ సభ్యులు హయత్నగర్ శ్రీనివాస్, ముఖ్య అతిథిగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి జయంతి వేడుకలు

**ముద్ర, ఖమ్మం:**



భారతీయ జనతాపార్టీ ఒన్ టౌన్ అధ్యక్షులు గడిల నరేష్ ఆధ్వర్యంలో స్థానిక గుర్రాలబొమ్మ సెంటర్ (ముస్తఫానగర్) లో గురువారం ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు,1 టౌన్ అధ్యక్షులు గడిల నరేష్ మాట్లాడుతూ శివాజీ మహారాజ్ మరాఠా యోధునిగా అందరి గుండెల్లో నిలిచి పోయారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని అందరూ వారి అడుగు జాడల్లో ప్రతిఒక్కరు నడుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, డోకూపర్తి రవీందర్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మందడపు ప్రభాకర్ రెడ్డి, పొట్టిమూతి జనార్దన్, బండారు శ్రీను, విజయరాజు, సురేష్ గౌడ్, బీజేపీ నాయకులు పాలేపు రాము, పొట్టిమూతి వాణి, బొడ్ల శ్రీను, కదుదుల ప్రభాకర్, బాలి బిందు, లోడంగి సత్యనారాయణ, మరిమెల్ల రామకృష్ణ, పార్వతి, మహీందర్ సింగ్, కృష్ణ చారి, అశోక్, మహేష్, శేఖర్ పాల్గొన్నారు.



## ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర భువనగిరి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్, ఇంటర్మీడియట్ అధికారి రమణి అధ్యక్షతన చీఫ్ సూపరింటెండెంట్ లకు డిపార్ట్మెంటల్ ఆఫీసర్ లకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు జరుగుతాయని, దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఫొటో జర్నలిస్ట్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్(టీపీజేఏ) యాదాద్రి భువనగిరి జిల్లా 2026 క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా కమిటీ క్యాలెండర్ ను జిల్లా కలెక్టర్ హనుమంతరావు గురువారం కలెక్టరేట్ ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధమల్ల రాజు, ఉపాధ్యక్షులుకృపానగరం ఫణిదర్, గుజ్జ నరేష్, ప్రధాన కార్యదర్శిదేశ్ పాండే నరసింహ,కోశాధికారి మోగిలిపాక కనక రాజు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## స్వర్ణగిరిలో అపూర్వ ఘట్టం

- **శ్రీవారి పాదాలను తాకిన సూర్య కిరణాలు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం అద్భుత ఆధ్యాత్మిక దృశ్యం ఆవిష్కృతమైంది. గురువారం ఉదయం 7 గంటలకు సూర్య భగవానుడి కిరణాలు నేరుగా గర్భాలయంలోకి ప్రవేశించి, స్వామివారి పాదాలను తాకాయి. గతంలో భీష్మ ఏకాదశి నాడు జరిగిన ఈ అపురూప ఘట్టం, నేడు మళ్ళీ పునరావృతమైంది. ఇది ఆలయ నిర్మాణ కౌశలానికి, ఆధ్యాత్మిక రహస్యానికి నిదర్శనమని భక్తులు కొనియాడారు. సూర్య కిరణాల వెలుగులో స్వామివారి దివ్య మంగళ స్వరూపం దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఈ అరుదైన దృశ్యాన్ని వీక్షించిన భక్తులు భక్తిపరవశంలో మునిగిపోయారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

**ముద్ర స్పోర్ట్స్, ఖమ్మం:**



ఇటీవల ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం లో జరిగిన సిఎం కప్ జిల్లాస్థాయి ఫుట్బాల్ క్రీడలో బాలికల విభాగం నుండి బాలుర విభాగం నుండి జిల్లా స్థాయిలో గోల్డ్ మోడల్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మల్లెమడుగు ) 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు కె.అనిత, ఏ.వెన్నెల, ఎం.జానీ లు రాష్ట్రస్థాయి సీఎం కప్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్ కు ఎంపికయ్యారు.శుక్రవారం నుండి ఆదివారం వరకు హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో ఖమ్మం జిల్లా టీం నుండి వీరూ పాల్గొంటున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సాంబమూర్తి, పిడి బియ్యని కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. అనిత గతంలో రాష్ట్రస్థాయి సీఎం కప్ గోల్డ్ మెడల్, రాష్ట్రస్థాయి జూనియర్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్లో సిల్వర్ మెడల్, రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్లో కాంస్య పతకం, వెన్నెల జానీ రాష్ట్రస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్లో పాల్గొన్నారని చెప్పారు.రాష్ట్రస్థాయి సీఎం కప్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్ కి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, శారద , హేమలత, స్వర్ణలత, సుధాకర్, బ్రహ్మాచారి,అమ్మాజీ, దేవ మనమ్మ, వెంకటేశ్వర్లు,సుజాత,అరుణ బాలమణి, రాజకుమారి, జానమ్మ నవీన్ సాహూ, సురంగా అభినందించగా, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు అలివేణి, 59, 60 డివిజన్ కార్పొరేటర్స్ లలితా రాణి, నిరంజన్ కుమార్, గ్రామ పెద్దలు కృష్ణమూర్తి, బోజర్ల సూర్యం, కృష్ణ, జానీ మియా, వెంకయ్య, వైకుంఠ చారి, తాటికొండ శ్రీనివాస్, తిరుపతిరావు, సైదులు, బట్టబోతుల సతీష్ లు అభినందనలు ప్రకటించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
20.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### టాప్ 10 ఎన్ కౌంటర్స్

**శేషాచలం ఎర్రచందనం స్మగ్లర్ల ఎన్‌కౌంటర్ (2015)**

తిరుపతి శేషాచలం అటవీలో 20 మంది ఎర్రచందనం కూలీలు ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇది నిజమైనదా లేదా ఫేక్‌నా అన్న దానిపై పెద్ద చర్చ జరిగింది.





## ‘పీఎం శ్రీ’ పనుల వేగం పెంచాలి

- **కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

సిద్దిపేట జిల్లాలో పీఎం శ్రీ పథకం ద్వారా 34 విద్యాలయాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో పీఎం శ్రీ పథకం ద్వారా జిల్లాలోని పలు ప్రభుత్వ విద్యాలయాల్లో చేపడుతున్న పనుల పురోగతి గురించి జిల్లా విద్యాశాఖ, ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పీఎం శ్రీ పథకం ద్వారా 34 విద్యాలయాల్లో చేపడుతున్న సైన్స్ ల్యాబ్స్, మరుగుదొడ్లు, భవిత కేంద్రాలు పనుల్లో వేగం పెంచాల న్నారు. ఆయా స్థాయిలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుని వెంటనే బిల్లు అప్ లోడ్ చేయాలని తెలిపారు. సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలో 22 కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో చేపడుతున్న పనులు సైతం వంద శాతం పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్ లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరియల్ అధికారి రామస్వామి, ఈడబ్ల్యూఐడీసీ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శివాజీ జయంతి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ పట్టణంలో గురువారం శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాందాస్ చౌరస్తాలో గల శివాజీ విగ్రహానికి ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం యువకులు రామాలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక, ఆర్ఎస్ఎస్ నగర సంగచాలక్ డాక్టర్ ఇప్ప భానుచందర్, శివాజీ కమిటీ అధ్యక్షుడు మాయ శంకర్, ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నాయిని ప్రసాద్, కార్యదర్శి సునీల్, పరశురాం, పృథ్వి, చెన్న రాంచందర్, జగదీష్, చింతల శ్రీను, గోవిందరాజు, వంశీ, చిన్న తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ వైస్ చైర్మన్ కు సన్మానం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దొంతి నరేష్ గౌడ్ ను గురువారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ తదితర కార్యక్రమాలలో చేసిన కృషిని కొనియాడారు. రానున్న రోజుల్లో సైతం నరేష్ గౌడ్ పట్టణ ప్రజలతో పాటు ఇటు జర్నలిస్టుల సంక్షేమానికి కోసం కూడా కృషి చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రతినిత్యం కృషి చేస్తానని తెలిపారు. తాను ఏ పదవిలో ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జర్నలిస్టులు కామాటి కిషన్, సురేంద్ర రెడ్డి ప్రకాష్, కె. రామకృష్ణ, గోపాల్ గౌడ్, లక్ష్మణ్, శ్యామ్, రాము, సంగమేశ్వర్ తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.




# రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి

- **సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించి, సంగారెడ్డిని ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఆర్ అండ్ బీ, రవాణా, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, ట్రాఫిక్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా ప్రమాదం సంభవించినప్పుడు, దానికి గల అసలు కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు.

**విద్యా సంస్థల్లో వసతులు కల్పించాలి..**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు ,అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, గ్రామీణాభివృద్ధి, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి అధికారులు-ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం పూర్తయిన వెంటనే కాంట్రాక్టర్లు వాటిని హెడ్‌మాస్టర్లకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని డిఈఓకు సూచించారు. ఈ సమావేశంలో డీడీఆర్డిఓ పీడీ జ్యోతి, డిడబ్ల్యూఓ లలిత కుమారి, సీపీఓ బాలశౌరి, అదనపు డిఆర్డిఓ బాలరాజ్, పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్ అధికారులు, విద్యుత్ శాఖ, విద్యా శాఖ తదితర అధికారులు పాల్గొన్నారు.



**విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..**

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని చదువుపై పూర్తి దృష్టి సారించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. గురువారం కలెక్టర్ పుల్కల్ మండలం గొంగ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింగూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు మరుగుదొడ్లలో శుభ్రత లోపంపై కలెక్టర్అ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ సింగూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. పాఠ్యాంశాల పురోగతిపై విద్యార్థులను ప్రశ్నించారు. ఆ తర్వాత బస్వాపూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనుల పురోగతిని పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్, పంచాయతీ సెక్రెటరీ, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# మక్కల డబ్బులు చెల్లించాలి

**ముద్ర, హైదరాబాద్:**

మక్కల డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తాడ్వాయి మండల కేంద్రంలో రైతులు ఆందోళన చేశారు. వానకాలంలో విక్రయించిన మక్కల డబ్బులు వెంటనే చెల్లించాలని ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మక్కల డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం సతాయిస్తోందన్నారు. మూడు నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా చితికి పోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిపోయిన మక్కలను కొనేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఒక్క తాడ్వాయి మండలంలోనే సుమారు 50 వేల క్వింటాళ్ల మక్కలు ఉన్నాయని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారన్న ఆశతో గత 15 రోజులుగా కొనుగోలు కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. అయితే కేంద్రాలు ప్రారంభించకపోవడంతో పడిగాపులు తప్పడం లేదన్నారు. రైతుభరోసా డబ్బులు సైతం సకాలంలో ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతుకూ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందించారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మక్క రైతులు పాల్గొన్నారు.




## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

**ముద్ర, హైదరాబాద్:**

విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభమైన ఏఐఎస్ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కార్పొరేట్ యాజమాన్యానికి వత్తాసు పలకకుండా అందరికీ ఒకే ఉచిత విద్యావిధానాన్ని రూపొందించాలని సూచించారు. అన్ని విద్యార్థి సంఘాలకు మూలం ఏఐఎస్ఎఫ్ అని, ఇది అన్ని సంఘాలకు మాతృ సంఘమని పేర్కొన్నారు. ఎందరో నాయకులు ఈ సంఘం ద్వారా ఎదిగారని, తాను కూడా ఏఐఎస్ఎఫ్ ద్వారా నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్నానని గుర్తు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం యూజీసీ ద్వారా ఉన్నత విద్యాసంస్థలకు నిధులు రాకుండా చేస్తున్నదని ఆరోపించారు. విద్యార్థులు భగత్‌సింగ్, చేగువేరాను హీరోలుగా గుర్తించాలని, సినిమా హీరోలని కాదని సూచించారు.

# పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**ముద్ర, హైదరాబాద్:**

ఎస్సెస్సీ, ఇంటర్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 14 నుంచి ఏప్రిల్ 15 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పదో తరగతి పరీక్షలు ఉంటాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 24,542 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు 144 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఫస్టియర్ పరీక్షకు 19,299 మంది, సెకండియర్ పరీక్షలకు 17,664 మంది కలుపుకొని మొత్తం 36,963 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, వీరి కోసం జిల్లాలో 58 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉండాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ అవకతవకలకు పాల్పడితే ఎంతమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. విద్యుత్, ఆర్టీసీ, వైద్య శాఖ అధికారులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమా ర్, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి రవికుమా ర్, డీఈవో అశోక్, ఏసీపీ మస్తాన్‌అలీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.








# గిరిజనులకు అండగా ప్రభుత్వం

- **ఎమ్మెల్యే రోహిత్ రావు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

గిరిజనులకు, లంబాడాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డా: మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. గురువారం మెదక్ పట్టణంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీలు, గిరిజనులు, లంబాడాలకు ఇందిరమ్మ రాజ్యంలోని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మెదక్ నియోజకవర్గంలోని తండాల్లో వివిధ రోడ్ల మరమ్మతుల కోసం రూ. 8 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. మరింత గిరిజనుల, లంబడాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నట్లు చెప్పారు. కాగా లంబాడా వేషధారణలో విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కనుగుల రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, ఆర్డీవో రమాదేవి, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, కల్కి మహరాజ్, భిక్షూ మహరాజ్, కౌన్సిలర్ సంధ్య, చంద్రం, గోపాల్ నాయక్, కిషన్, దేవుల, హీరాలాల్, అశోక్, శ్రీను నాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**జ్ఞానజ్యోతిని వెలిగించిన గురువు: కలెక్టర్**

బంజారాల జీవితంలో జ్ఞానజ్యోతిని వెలిగించిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బంజారాల అభివృద్ధి కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని గుర్తు చేశారు. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ దేశమంతా సంచరించి హితబోధ చేశారని గుర్తు చేశారు. దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ ఏకం చేశారని పేర్కొన్నారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం పూజారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
20.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వరంగల్ జిల్లా ఎన్‌కౌంటర్ (2016)**

మావోయిస్టు నేతలుగా భావించిన ఇద్దరిని పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చంపిన ఘటనపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. మానవ హక్కుల సంఘాలు ఇది స్టేజ్ చేసినదని ఆరోపించాయి.





# ముస్లింలకు మహా షాక్..

- **5 శాతం కోటా కట్!**

**ముద్ర డెస్క్ :**

అగ్రవర్ణ పేదలకు కేంద్రం కొన్నేళ్లుగా రిజర్వేషన్లు అమలు చేస్తోంది. వారికి కల్పించిన 10 శాతం రిజర్వేషన్ల కారణంగా ఎంతో మంది ఉద్యోగాలు పొందుతున్నారు. మత ప్రాతిపదికన రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించొద్దని సూచిస్తోంది. దీని ఆధారంగా కేంద్రం అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ తెచ్చింది. ఇక బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గతంలో అమలు చేసిన మతపరమైన రిజర్వేషన్లను బీజేపీ, దాని మిత్ర పక్ష ప్రభుత్వాలు ఎత్తేస్తున్నాయి. తాజాగా మహారాష్ట్రలో గత ప్రభుత్వం అమలు చేసిన ముస్లింలకు 5 శాతం కోటాను తాజాగా రద్దు చేసింది.

**ఉత్తర్వులు జారీ..**

మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్‌ను అధికారికంగా రద్దు చేసింది. దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిత్వంలో సోషల్ జస్టిస్ విభాగం మంగళవారం జీఆర్ జారీ చేసింది. దీంతో 2014లో జారీగా ఆర్డినెన్స్ రద్దవుతుంది. ఈ కేటగిరీ కింద కుల, నాన్-క్రీమీ లేయర్ సర్టిఫికెట్ల జారీని కూడా నిషేధించారు.

**కాంగ్రెస్–ఎన్‌సీపీ ప్రభుత్వం చొరవ..**

2014లో కాంగ్రెస్-ఎన్సీపీ ప్రభుత్వం ముస్లింలను స్పెషల్ బ్యాక్‌వర్డ్ క్లాస్-ఏ (ఎస్బీసీ-ఏ) కింద చేర్చి ఈ కోటాను ప్రవేశపెట్టింది. బాంబే హైకోర్టు నవంబర్ 2014లో దానిపై స్టే ఇచ్చి, విద్యా సంస్థల్లో మాత్రమే అమలుకు అనుమతించింది. సుప్రీంకోర్టు కూడా దీన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించింది, ఫలితంగా అమలు ఆగిపోయింది.

**విపక్షాల విమర్శలు**

కాంగ్రెస్ నేత వర్షా గైక్వాడ్ ఈ నిర్ణయాన్ని తప్పు పట్టారు. ముస్లింలను మెయిన్‌స్ట్రీమ్ నుంచి దూరం చేస్తుందని ఆరోపించారు. ఎన్సీపీ(ఎస్పీ) నేత సుప్రియా సూలే, క్లైడ్ క్రాస్టో బీజేపీ మైనారిటీలకు విలువ లేని పార్టీగా చిత్రీకరించారు. మహావికాస్ అఘాడి పక్షాలు దీన్ని ముస్లిం యువత అభివృద్ధికి అడ్డంకిగా చూస్తున్నాయి.

# మధ్యప్రాచ్యంలో ముంచుకొస్తున్న యుద్ధం

- **ఇరాన్ పై దాడికి రెడీ.. ట్రంప్ నిర్ణయంపైనే ప్రపంచ భవితవ్యం**

**ముద్ర డెస్క్ :**

ప్రపంచం మళ్ళీ ఒక పెను సంక్షోభం అంచున నిలబడింది. గత కొన్ని రోజులుగా ఇరాన్ , అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకున్నాయి. అమెరికా తన వాయుసేన, నౌకాదళ బలగాలను మధ్యప్రాచ్యానికి భారీగా తరలించడం చూస్తుంటే తుఫానుకు ముందు నెలకొన్న నిశ్శబ్దంలా కనిపిస్తోంది. అయితే ఈ యుద్ధం జరగాలా వద్దా అన్నది ఇప్పుడు ఒకే ఒక్క వ్యక్తి చేతిలో ఉంది. ఆయనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.

**యుద్ధానికి సిద్ధం..**

**కానీ డైలమాలో ట్రంప్?**

అమెరికా మీడియా కథనాల ప్రకారం.. ఈ వారాంతంలోనే ఇరాన్‌పై దాడులు జరిగే అవకాశం ఉంది. ట్రంప్ తన వ్యూహకర్తలతో నిరంతరం చర్చిస్తున్నారు. ఇరాన్ అణు కార్యక్రమాలను శాశ్వతంగా అడ్డుకోవాలనేది ఆయన ప్రధాన లక్ష్యం. కానీ ఒక పూర్తిస్థాయి యుద్ధం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థపై పడే భారం, అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరల పెరుగుదల, ప్రాణనష్టం వంటి అంశాలు ఆయనను ఆలోచనలో పడవేస్తున్నాయి. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలైన్ లీవిట్ మాటలను బట్టి చూస్తే అమెరికా "శాంతిని కోరుకుంటున్నా యుద్ధానికి భయపడటం లేదు" అనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దౌత్య మార్గాలకు ప్రాధాన్యత ఇస్తూనే సైనిక చర్యను 'ప్లాన్ బి'గా సిద్ధంగా ఉంచారు.

**ఇజ్రాయెల్ కూటమి..**

**మరింత భారీ వ్యూహం**

ఈసారి జరగబోయే ఆపరేషన్ గతంలో జరిగిన చిన్నపాటి ఘర్షణల లాంటిది కాదు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా వారాల పాటు సాగే భారీ సైనిక ఆపరేషన్‌కు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 28న అమెరికా విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్‌లో ప్రధాని నెతన్యాహూతో జరిపే భేటీ ఈ యుద్ధ దిశను మార్చవచ్చు. బ్రిటన్‌కు చెందిన డియేగో గార్షియా వ్యూహాత్మక స్థావరాన్ని వదులుకోవద్దని ట్రంప్ హెచ్చరించడం వెనుక, దానిని ఇరాన్ వ్యతిరేక కార్యకలాపాలకు వేదికగా మార్చాలనే పక్కా ప్లాన్ కనిపిస్తోంది.

**ఇరాన్ ప్రతిఘటన.. రష్యా అండ?**

మరోవైపు ఇరాన్ కూడా చేతులు ముడుచుకుని కూర్చోలేదు. హార్ముజ్ జలసంధిలో నౌకాదళ విన్యాసాలు, రాకెట్ ప్రయోగాల హెచ్చరికలతో తాము కూడా దేనికైనా సిద్ధమే అని చాటుతోంది. ముఖ్యంగా రష్యాతో కలిసి సంయుక్త సైనిక విన్యాసాలు చేయడం ద్వారా ఇది కేవలం రెండు దేశాల మధ్య పోరు కాదని ప్రపంచ అగ్రరాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**అమెరికాలోనే భిన్నాభిప్రాయాలు**

ట్రంప్ తీసుకునే నిర్ణయం పట్ల అమెరికా కాంగ్రెస్‌లో వ్యతిరేకత కూడా వ్యక్తమవుతోంది. "మరిన్ని యుద్ధాలు వద్దు" అనే నినాదంతో కొందరు ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అనుమతి లేకుండా యుద్ధానికి వెళ్లడం రాజ్యాంగ విరుద్ధమని వారు వాదిస్తున్నారు.

**శాంతి కావాలా? సర్వనాశనం కావాలా?**

యుద్ధం ఎప్పుడూ సమస్యలకు పరిష్కారం కాదు.. అది కేవలం కొత్త సమస్యలను సృష్టిస్తుంది. ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' విధానంలో భాగంగా యుద్ధానికి మొగ్గు చూపుతారా? లేక దౌత్యపరమైన ఒత్తిడితో ఇరాన్‌ను దారికి తెచ్చుకుంటారా? అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఒకవేళ యుద్ధం మొదలైతే అది కేవలం మధ్యప్రాచ్యానికే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి ప్రపంచం మొత్తం శ్వాస బిగబట్టి వాషింగ్టన్ వైపు చూస్తోంది. ట్రంప్ సంతకం చేసే ఒక ఉత్తర్వు ప్రపంచ భవిష్యత్తును మార్చేయగలదు.





# ఏపీలో నియోజకవర్గాల పెంపు..?!

**ముద్ర డెస్క్ :**

ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనపై సంకేతాలు పంపింది. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పునర్విభజనకు సంబంధించి బిల్లును పార్లమెంటులో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఏపీలో అసెంబ్లీ సీట్లు మరో 50 పెరిగే అవకాశం ఉంది. ఏడు పార్లమెంట్ స్థానాలు సైతం పెరగనున్నట్లు తెలుస్తోంది.. నియోజకవర్గాల పెంపు అనేది రాష్ట్ర విభజన సమయంలోనే ప్రస్తావనకు వచ్చింది. విభజన చట్టంలోనే నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాజకీయ అవకాశాలు పెంచుతామని స్పష్టంగా చెప్పారు. పాలనా వికేంద్రీకరణకు నియోజకవర్గాల పెంపు చేపడతామని చెప్పుకొచ్చారు. కానీ ఇంతవరకు నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు.



**మారనున్న లెక్క..**

ప్రస్తుతం రాష్ట్రంలో 175 అసెంబ్లీ... 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు.. 117 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో అధికార పార్టీకి అనుకూలంగా ఈ ప్రక్రియ జరిగింది అనేది ఒక విశ్లేషణ. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అప్పట్లో తెలుగుదేశం పార్టీ కూడా బలంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపికి బలమైన స్థానాలను... విభజించి బలహీనపరిచారు అన్నది ఒక ఆరోపణ. ఇప్పుడు కూడా టిడిపి కూటమి రాష్ట్రంలో ఉంది. కేంద్రంలో టిడిపి బలమైన భాగస్వామ్య పక్షంగా ఉంది. ఇప్పుడు గాని నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజక వర్గాలు తారుమారు అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది.

**కూటమికి లాభం**

మొన్నటి ఎన్నికల్లో జనసేన 21, బిజెపి 10, మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేసింది. అయితే 164 సీట్లలో కూటమి గెలిచింది. అయితే పొత్తులో భాగంగా ఓ 50 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. టిడిపిలో ఇటువంటి వారి సంఖ్య అధికంగా ఉంది. మరోవైపు జనసేనతో పాటు బిజెపిలో సైతం చాలామంది ఎమ్మెల్యే సీట్ల ఆశావాహులు ఉన్నారు. ఎన్నికలకు ముందు, తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపి కూటమిలో చాలామంది నేతలు చేరారు. ఇప్పుడు వారందరికీ రాజకీయ అవకాశాలు కల్పించడం అనేది కష్టం. ఇటువంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా 50 అసెంబ్లీ స్థానాలు, ఏడు పార్లమెంటు సీట్లు పెరిగితే మాత్రం కూటమికి ప్లస్ గా మారుతుంది. ఇంకోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు.. విభజనతో మరింత బలహీనమవుతాయి. ఇలా ఎటు చూసుకున్నా నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపి కూటమికి ఎక్కువగా మేలు జరుగుతుంది.

# పోలీస్ జాగిలాల పాత్ర కీలకం

- **మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు**
- **శిక్షణ పూర్తి చేసుకున్న మెదక్ జిల్లా పోలీస్ జాగిలాలు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



నేరాల చేదనలో పోలీస్ జాగిలాల పాత్ర అత్యంత కీలకమని మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు అన్నారు. మొయినాబాద్‌లోని ఐఐటీఏలో శిక్షణ పూర్తి చేసుకొని నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో జాగిలాలు పాల్గొన్నాయి. జాగిలాలు రెండు విభాగాల్లో శిక్షణ పొందాయి. బీరప్పకు చెందిన 'భైరవ్' స్నేఫర్ విభాగంలో శిక్షణ పూర్తిచేసింది. రమేష్, గణేష్‌లకు చెందిన 'బ్రూనో' ట్రాకర్ విభాగంలో 8 నెలల పాటు ప్రత్యేక శిక్షణను పూర్తి చేసింది. గురువారం మెదక్ ఎస్పీ జాగిలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జాగిలాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి సర్టిఫికెట్లు అందించి అభినందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ జాగిలాలు నేరాల చేదనలో ఎంతో తోడ్పడుతున్నాయని తెలిపారు. పేలుడు పదార్థాల గుర్తింపు, మాదకద్రవ్యాల స్వాధీనం, నిందితుల గాలింపు, తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ తెలుసుకోవడంలో జాగిలాల సేవలు అమూల్యమని కొనియాడారు. ఆధునిక కాలంలో నేరస్తులు కొత్త పద్ధతులు అవలంబిస్తున్నారన్నారు. అలాంటి సందర్భాల్లో శిక్షణ పొందిన జాగిలాలు పోలీస్ విభాగానికి బలంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కఠినమైన శిక్షణతో మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారైన భైరవ్, బ్రూనో జాగిలాలు మెదక్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు మరింత సమర్థంగా సేవలందిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. జాగిలాలను నిర్వహించే సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఆర్ఐ శైలేందర్, ఆర్ఎస్ఐ భవాని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక స్మార్ట్ కార్డు ప్రయాణం

- **ఉచిత ప్రయాణంలో కీలక మార్పు**
- **జూన్ నుంచి అమల్లోకి..?**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణంపై మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం పథకానికి ఆదరణ పెరుగుతోంది. పెద్ద సంఖ్యలో మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ప్రయాణ సమయంలో ఆధార్ కార్డును ఎక్కువ మంది గుర్తింపు కార్డుగా వినియోగిస్తున్నారు. కాగా, ఇప్పుడు ప్రయాణికులకు ఇక నుంచి ఆధార్ తో అవసరం లేకుండా కొత్త విధానం అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. దీని ద్వారా టికెట్.. ఆధార్ లేకుండా ఈ కొత్త నిర్ణయం మేరకు ఉచిత ప్రయాణం కొనసాగించే వెసులుబాటు మహిళా ప్రయాణికులకు దక్కనుంది. తెలంగాణలో ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. నిరంతరం సమీక్ష చేస్తోంది. పథకాన్ని మరింత విస్తరించేలా కార్యాచరణ అమలు చేస్తోంది. ఇప్పటి వరకు మహిళలు ఆధార్ కార్డు చూపించిన తర్వాత కండక్టర్ నుంచి జీరో టికెట్ తీసుకుని ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీగా ప్రయాణించవచ్చు. అయితే కొంతమంది మహిళల ఆధార్ కార్డుల్లో పాత ఫొటోలు ఉండటంతో కండక్టర్లు అలాంటి వారిని నిర్ధారించుకోవడం కష్టంగా మారింది. దీంతో, ఉచిత ప్రయాణం చేసే మహిళలకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. జూన్ 2 నుంచి ఈ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు రకాల స్మార్టు కార్డులను ప్రవేశ పెడుతున్నారు. ఈ స్మార్ట్ కార్డులను ఒక జిల్లాలోని మండలంలో పైలట్ ప్రాజెక్టుగా చేయాలని నిర్ణయించారు. తొలి దశ ప్రాజెక్టుగా దాదాపు 5 లక్షల మందికి స్మార్ట్ కార్డులు ఇవ్వనున్నట్లు సమాచారం. దీని తయారీకి సుమారుగా రూ.75 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.

**జూన్ నుంచి కొత్త కార్డులు..**

జూన్ 2 నుంచి స్మార్ట్ కార్డుల పంపిణీ చేయనున్నారు. ఈ కార్డు జారీలో ప్రతి ప్రయాణికురాలికి 16 అంకెల యూఐడీ నంబర్ ఇస్తారు. ఆ కార్డు ముందు సైడ్ ఎడమ వైపు లబ్ధిదారు పేరు, గ్రామం, మండలం, జిల్లా తదితర వివరాలు ఉంటాయి. కుడివైపు ఫొటో ఉంటుంది. వెనుక భాగంలో ఉచిత బస్సు పథకానికి సంబంధించిన నియమ నిబంధనలు పొందుపరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.5 కోట్ల మందికి ఈ స్మార్ట్‌కార్డులు జారీ కానున్నాయి. ఇందుకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌తో కీలక ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ సహకారంతో ప్రతీ మహిళకు ప్రత్యేక కార్డులు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చే ఈ స్మార్ట్ కార్డు చూపించి మహిళలు ఇకపై ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం బెంగళూరు, ముంబయి, లక్నో నగరాల్లోని బస్సుల్లో స్మార్ట్‌కార్డు విధానాల్లో ఎలాంటి ఫీచర్లు అమలు చేస్తున్నారనే అంశం పైన అధికారులు అధ్యయనం చేస్తున్నారు.

# జోగిపేట బస్టాండ్ లో చోరీ

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

జిల్లాలోని జోగిపేట బస్టాండ్ లో గురువారం భారీ చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అల్లాదుర్గం గ్రామానికి చెందిన చెగురి లక్ష్మీదేవి హైదరాబాద్ లో జరిగే మనుమడి వివాహం కోసం బయలుదేరింది. జోగిపేటలో వారి బంధువులను తీసుకెళ్లేందుకు బస్టాండ్ లో దిగింది. వియ్యంకురాలు, బంధువులు రావడంతో అందరు కలసి బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె బ్యాగ్ ఎత్తుకొని పారిపోయాడు. అందులో 12 తులాల బంగారు ఆభరణాలు, రూ. 8వేల నగదు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. బ్యాగులో పెద్ద గోలుసు, కంకణాలు, నాను, వంక, సాదా ఉంగరాలతో పాటు రూ.8 వేల నగదు ఉన్నట్లు ఆమె పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

**తరుచూ ఇలాంటి సంఘటనలు ..**

జోగిపేట బస్టాండ్ లో తరుచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. మూడు నెలల క్రితం వృద్ధురాలి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగ్ ఎత్తుకెళ్లారు. అందులో 7 తులాలు బంగారం ఉన్నట్లు ఆమె ఫిర్యాదు చేసింది. పదిహేను రోజుల క్రతం మల్లన్నకాలనీ, ఇందిరానగర్ కాలనీల్లో గుర్తు తెలియని వ్యక్తులు మూడు ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారం, విలువైన పత్రాలు దొంగిలించారు, ఇంత వరకు పోలీసులు ఛేదించలేకపోయారు. మూడు నెలల క్రితం వాహనంలో వస్తున్న బీఆర్ఎస్ టేక్మాల్ మండల అధ్యక్షుడు బత్తుల వీరప్ప దంపతులను అల్మాయిపేట ప్రధాన రహదారిపై యువకులు దాడి చేసి గాయపరిచారు. ఈలాంటి ఘటనలు జరుగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# గద్దర్ ఫిల్మ్ అవార్డ్ జ్యూరీలో మార్పు

- **స్పెషల్ జ్యూరీ చైర్మన్‌గా తమ్మారెడ్డి భరద్వాజ నియామకం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025 జ్యూరీ కమిటీలో కీలక మార్పు జరిగింది. తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్పెషల్ జ్యూరీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజను నియమించింది. దర్శకుడు రాఘవేంద్రరావు స్థానంలో తమ్మారెడ్డి భరద్వాజకు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు గురువారం ఆ కార్పొరేషన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఉగాది పండుగ సందర్భంగా మార్చి 19న తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఈ పురస్కారాలకు ఎంపికైన చిత్రాల స్క్రీనింగ్ ఈ నెల ఆరో తేది నుంచే ప్రారంభమైంది. తెలుగు సినీ పరిశ్రమకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. భారతీయ సినీ రంగానికి హైదరాబాద్ను కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ముందుకెళ్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
20.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10 ఎన్‌కౌంటర్స్**

భద్రాద్రి-కొత్తగూడెం ఆపరేషన్ (2018) ఈ జిల్లాలో మావోయిస్టులపై పోలీసులు భారీ కాంబింగ్ ఆపరేషన్స్ నిర్వహించారు. కొందరు మిలిటెంట్లు ఎన్‌కౌంటర్లలో హతమైనట్లు అధికారిక సమాచారం వచ్చింది.





## అన్న పెళ్లితో తమ్ముడి దొంగతనం బట్టబయలు

**ముద్ర న్యూస్ :**

చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విచిత్రమైన కేసు వెలుగులోకి వచ్చింది. సొంత కుటుంబ సభ్యుల బంగారాన్ని దొంగిలించి, గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దొంగతనం చేశారని కట్టుకథ అల్లిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో రూ.12 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు నిందితుడు భాస్కర్ ప్రమోద్ ముల(32) బీటెక్ పూర్తి చేశాడు. 2014లో ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన అతడు మధ్యలోనే చదువులు మానేసి తిరిగి వచ్చాడు. బెంగళూరులో ఉన్న సమయంలో విలాసవంతమైన జీవన శైలికి అలవాటు పడి, క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాల ద్వారా అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చేందుకు 2024 నుంచి తన నానమ్మ, కుటుంబ సభ్యుల బంగారాన్ని దొంగిలించి బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.4,60,000 నగదు పొందాడు.

**- నకిలీ దొంగతనం డ్రామా.. దర్యాప్తులో నిజం వెలుగులోకి..**

ఇటీవల అన్నయ్య పెళ్లి ఖరారు కావడంతో కుటుంబ సభ్యులు నానమ్మ బంగారాన్ని తీసుకోవాలని నిర్ణయించారు. దీంతో భయాందోళనకు గురైన నిందితుడు దొంగతనం బయట పడకుండా ఉండేందుకు పథకం రచించాడు. ఫిబ్రవరి 9న తన పెంట్‌హౌస్‌లో దొంగతనం జరిగినట్లు నాటకం ఆడి, గుర్తు తెలియని వ్యక్తులు బంగారం, వెండి అపహరించారని పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫిర్యాదుదారుడే అసలు నిందితుడని గుర్తించారు. విచారణలో అతడు కొన్ని వెండి వస్తువులను మూసీ నాలాలో పడేసినట్లు అంగీకరించాడు. స్వాధీనం చేసుకున్న సొత్తులో రెండు బంగారు ఉంగరాలు (సుమారు 3తులాలు), ఒక వెండి పలక, రెండు వెండి గిన్నెలు, అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ ముత్తూట్ ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టిన 80 గ్రాముల బంగారం గిరవు రసీదులు ఉన్నాయి. మొత్తం విలువ సుమారు రూ.12లక్షలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో సికింద్రాబాద్ జోన్ డీసీపీ ఐపీఎస్ రక్షితా కృష్ణమూర్తి, అదనపు డీసీపీ జె.నర్సయ్య మార్గదర్శకత్వంలో చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ ఎం.మల్లేశం, ఎస్సై మొహమ్మద్ కరీమ్, క్రైమ్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించారు.



## ఎస్ఎల్.బీసీ టన్నెల్ పనులు మళ్లీ షురూ

**ముద్ర డెస్క్ :**

ఎస్ఎల్ బీసీ టన్నెల్ పనులు ఎట్టకేలకు మళ్లీ మొదలయ్యాయి. ఏడాది గ్యాప్ తర్వాత మంగళవారం అధికారులు టన్నెల్ పనులను ప్రారంభించారు. నిరుడు ఫిబ్రవరిలో టన్నెల్ కూలి 8మంది సిబ్బంది మరణించిన సంగతి తెలిసిందే. చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. తర్వాత పనులను పునరుద్ధరించేందుకు టన్నెల్ ఎక్స్ పర్టులను ప్రత్యేకంగా ప్రభుత్వం నియమించింది. ఎన్జీఆర్ఐతో పరీక్షలూ చేయించింది. టన్నెల్ బోరింగ్ మెషీన్‌తో కాకుండా.. డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ పద్ధతిలో పనులు చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం 4.45 గంటలకు బ్లాస్టింగ్ ను టన్నెల్ అధికారులు చేపట్టారు. అవుట్ లెట్ 20.435 కిలోమీటర్ పాయింట్ వద్ద.. 3.50మీటర్ల మేర బ్లాస్టింగ్ ను విజయవంతంగా చేపట్టారు. ఇకపై అన్ని భద్రతా ప్రమాణాలను పాటిస్తూ రోజూ నిర్విరామంగా టన్నెల్ బ్లాస్టింగ్ పనులు చేపడతామని అధికారులు చెప్తున్నారు.

## హైకోర్టులో సీఎం రేవంత్‌కు ఊరట

**ముద్ర న్యూస్ :**



హైకోర్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వల్ప ఊరట లభించింది. 2023లో భూపాలపల్లి పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పలు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నేత గండ్ర వెంకటరమణారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో తనపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు చేశారని మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లో గండ్ర వెంకటరమణారెడ్డి రెండు ఫిర్యాదులు చేశారు. అయితే.. ఈ రెండు కేసులను కొట్టివేయాలని సీఎం రేవంత్ రెడ్డి సైతం గతంలోనే క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా భూపాలపల్లి కోర్టులో హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం విచారణకు స్వీకరించిన కోర్టు.. భూపాలపల్లి కోర్టులో హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. అంతకుముందు కౌంటర్ దాఖలుకు గండ్ర వెంకటరమణారెడ్డి తరపు న్యాయవాది కోర్టును కోరారు.

# ఏఐ పవర్‌హౌస్‌గా భారత్

- **మనవ్ మంత్రం వివరించిన ప్రధాని**

**ముద్ర డెస్క్ :**



కృత్రిమ మేధస్సు అనేది కేవలం ఒక సాంకేతికత మాత్రమే కాదని, అది మానవ చరిత్ర గమనాన్ని మలిచే చారిత్రాత్మక మలుపని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇండియా కృత్రిమ మేధస్సు ప్రభావ సదస్సు-2026లో ప్రపంచ దేశాల ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. వందకు పైగా దేశాల నాయకులు, సాంకేతిక నిపుణులతో సదస్సు ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కృత్రిమ మేధస్సు అభివృద్ధిలో భారత్ అనుసరించబోయే ఐదు సూత్రాల విధానాన్ని ప్రధాని వివరించారు. “మనవ్” అనే సంక్షిప్త పదానికి ఆయన ఇచ్చిన వివరణ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎం - మోరల్ అండ్ ఎథికల్ : నైతిక విలువలతో కూడిన వ్యవస్థ.

ఏ - అకౌంటబుల్ గవర్నెన్స్ : జవాబుదారీతనంతో కూడిన పాలన.

ఎన్ - నేషనల్ సావరెయింటీ : జాతీయ సార్వభౌమాధికారం.

ఏ - యాక్సెసిబుల్ టెక్నాలజీ : అందరికీ అందుబాటులో ఉండే సమ్మిళిత సాంకేతికత.

వీ - వాలిడేటెడ్ సిస్టమ్స్ : చట్టబద్ధమైన, చెల్లుబాటు అయ్యే వ్యవస్థలు.

**వైర్‌లెస్ విప్లవం- ఏఐ**

గతంలో వైర్‌లెస్ సమాచార ప్రసారం ప్రారంభమైనప్పుడు ప్రపంచం ఇంతగా అనుసంధానమవుతుందని ఎవరూ ఊహించలేదని, ఇప్పుడు కృత్రిమ మేధస్సు కూడా అలాంటి పరివర్తననే తీసుకురానుందని మోదీ అన్నారు. “యంత్రాలు తెలివైనవిగా మారుతున్నాయి. ఇది మానవ సామర్థ్యాలను వందల రెట్లు పెంచుతుంది. అయితే మనుషులు కేవలం దత్తాంశ బిందువులుగా మిగిలిపోకూడదు. వారి సాధికారతే కృత్రిమ మేధస్సు లక్ష్యంగా ఉండాలి” అని స్పష్టం చేశారు.

**భారతదేశమే ఏఐకి సరైన వేదిక**

ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా, అత్యధిక సాంకేతిక ప్రతిభ కలిగిన భారత్ కృత్రిమ మేధస్సు అభివృద్ధికి బలమైన కేంద్రంగా నిలుస్తుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. “అందరి సంక్షేమం కోసం, అందరి శ్రేయస్సు కోసం” అనే భావనతో భారత్ ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి కృత్రిమ మేధస్సు వ్యవస్థను అందిస్తున్నామన్నదే నేటి అసలు బాధ్యత అని పేర్కొన్నారు.

**సదస్సుకు హాజరైన ప్రపంచ నేతలు**

ఈ సదస్సులో వందకు పైగా దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, లూలా డ సిల్వా సహా పలువురు దేశాధినేతలు భారత కృత్రిమ మేధస్సు దృష్టికోణాన్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగాన్ని కృత్రిమ మేధస్సు సాయంతో తెలుగులోకి అనువదించారు.

# ఏఐ భయం వద్దు..

- **అది ఉత్పాదకతను పెంచే ‘వరప్రదాయిని’!**
- **సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలపై ఏఐ ప్రభావం**
- **టీసీఎస్ సీఈఓ క్లారిటీ!**

**ముద్ర డెస్క్ :**



సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రస్తుతం హాట్ టాపిక్ కృత్రిమ మేధస్సు (ఏఐ). ఏఐ కారణంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కోల్పోతామన్న ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో భారతీయ సమాచార సాంకేతిక దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ప్రధాన కార్యనిర్వాహక అధికారి కె. కృతివాసన్ చేసిన వ్యాఖ్యలు నిపుణుల్లోనూ, నిరుద్యోగుల్లోనూ కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక సంస్థలు ఉద్యోగాల కోతలు ప్రకటిస్తుండటంతో ఇదంతా ఏఐ ప్రభావమేనని చాలామంది భావిస్తున్నారు. అయితే టీసీఎస్ సీఈఓ కృతివాసన్ ఈ వాదనను తోసిపుచ్చారు. ఏఐ అనేది ఉద్యోగాలను హరించే “భూతం” కాదని, పని సామర్థ్యాన్ని పెంచే ఒక సాధనమని స్పష్టం చేశారు. ఏఐ వినియోగంతో అభివృద్ధికారులు తమ కోడింగ్ తదితర పనులను గతంతో పోలిస్తే 20 నుంచి 30 శాతం వేగంగా పూర్తి చేయగలరన్నారు. దీంతో ప్రాజెక్టులు త్వరగా పూర్తవడంతో సంస్థలకు కొత్త ఖాతాదారులు వచ్చే అవకాశముంటుంది. పాత విధానాల ఉద్యోగాల స్వరూపం మారవచ్చని, అయితే ఔషధ ఆవిష్కరణ, స్వయంచాలకీకరణ, దత్తాంశ విశ్లేషణ, ఏఐ అనువర్తనాల అభివృద్ధి వంటి విభాగాల్లో భారీగా నియామకాలు జరిగే అవకాశముందని అంచనా వేశారు. ఐటీ సంస్థలు ఇప్పుడు గంటల ప్రాతిపదికకు బదులుగా ప్రాజెక్టుల ఫలితాల ఆధారంగా చార్జీలు విధించే దిశగా మారుతున్నాయని తెలిపారు. ఇది సంస్థల ఆదాయ స్థిరత్వాన్ని పెంచుతుందని పేర్కొన్నారు.

**డేటా సెంటర్ల వెల్లువ : భారత్‌కు భారీ అవకాశం..**

ఏఐ అమలుకు భారీ దత్తాంశ కేంద్రాలు అవసరమవుతాయి. రాబోయే మూడేళ్లలో భారతదేశంలో సుమారు 10 గిగావాట్ల సామర్థ్యం గల దత్తాంశ కేంద్రాల అవసరం ఉంటుందని అంచనా. దత్తాంశ కేంద్రాల మౌలిక వసతులు, మేఘ గణన, సైబర్ భద్రత విభాగాల్లో లక్షలాది కొత్త ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**ఐటీ ఉద్యోగులు ఏం చేయాలి?**

కేవలం భయపడుతూ కూర్చోవడం ప్రయోజనకరం కాదని నిపుణులు సూచిస్తున్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం అవసరం. ప్రాథమిక కోడింగ్, ఏఐ సూచన రూపకల్పన, దత్తాంశ శాస్త్రం, మాన్యువల్ పరీక్షలతో పాటు ఏఐ ఆధారిత స్వయంచాలక నైపుణ్యాలు నేర్చుకోవాలని సూచిస్తున్నారు.

**మార్పును స్వీకరించడమే విజయ రహస్యం..**

టీసీఎస్ సీఈఓ వ్యాఖ్యలను బట్టి చూస్తే ఏఐ వల్ల ఐటీ రంగం అంతమవదని, కొత్త దిశగా పుంజుకుంటుందని స్పష్టమవుతోంది. టైప్‌రైటర్లు తొలగిపోయి కంప్యూటర్లు వచ్చినప్పుడు కూడా ఇలాంటి భయాలు వ్యక్తమయ్యాయి. అయితే ఆ తర్వాతే ఉద్యోగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఏఐ విషయంలోనూ అదే జరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సరైన నైపుణ్యాభివృద్ధి ద్వారా సాంకేతిక ప్రపంచంలో మన స్థానాన్ని సుస్థిరం చేసుకోవచ్చని సూచిస్తున్నారు.

# అక్కడ పెళ్ళాన్ని కొట్టొచ్చు తిట్టొచ్చు..

- **కేసులు ఉండవు.. కొత్త చట్టం**
- **అఫ్ఘనిస్తాన్ లో పురుషులదే ఆధిపత్యం**

**ముద్ర న్యూస్ :**



ప్రపంచంలో స్త్రీ పురుషులు సమానంగా ఎదుగుతున్నారు. ఆకాశంలో సగం అన్నట్లు అన్నిరంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. దీంతో మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రిజర్వేషన్లు కూడా చేస్తున్నారు. వ్యవసాయ కూలీ నుంచి పైలెట్ వరకు.. రాకెట్‌లో అంతరిక్షంలోకి వెళ్లే వరకు ఎక్కడా మహిళ వెనుకడుగు వేయడం లేదు. దీంతో మహిళల రక్షణకు ప్రభుత్వాలు చట్టాలు కూడా చేస్తున్నాయి. పనిస్థలాల్లో వేధింపుల నేపథ్యంలో ఇలాంటివి అవసరం అవుతున్నాయి. మహిళ లేనిదే సమాజం లేదనేది సత్యం. మన దేశంలో మహిళలను కొట్టడం చట్టరీత్యా నేరం. గృహహింస అంతకన్నా నేరం. కానీ ఆ దేశంలో మహిళను, ముఖ్యంగా భార్యను కొట్టడం చట్టబద్ధం. ఇప్పటికే మహిళల చదవును నిషేధించిన ఆ దేశం ఇప్పుడు అరాచక గృహహింసను చట్టబద్ధం చేసింది. మహిళల హక్కులను హరించింది.

**గృహ హింసకు ఆమోదం..**

ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్ పాలకులు మతం పేరుతో అరాచక పాలన సాగిస్తున్నారు. అమెరికా సైన్యం దేశం విడిచి వెళ్లిన తర్వాత అధికారం చేపట్టిన తాలిబాన్లు.. మంత పేరుతో మహిళల హక్కులను హరిస్తున్నారు. ఇప్పటికే బాలికా విద్యను నిషేధించారు. తాజాగా గృహ హింసను చట్టబద్ధం చేశారు. భర్తలు, పురుషులు మహిళలను శారీరకంగా శిక్షించినా, ఎముకలు విరగకపోతే నేరం కాదని కొత్త చట్టం పేర్కొంది. రక్తస్రావం లేకపోతే శిక్ష లేదు. గాయాలతో బయటకు కనిపిస్తే కేవలం 15 రోజుల జైలు, అది కూడా మహిళ నిరూపించాల్సి ఉంది.

**మహిళలపై ఆంక్షలు**

ఇక మహిళలు భర్త అనుమతి లేకుండా బంధువుల వద్దకు వెళ్తే 3 నెలల జైలు. కోర్టులో గాయాలు చూపించేటప్పుడు పూర్తిగా కవర్ చేసుకోవాలి, బాధ్యుడైన పురుషుడు వెంట ఉండాలి. 2009 గృహహింస చట్టాన్ని పూర్తిగా రద్దు చేశారు. ఆర్టికల్ 9 ప్రకారం సమాజాన్ని ఉల్మా, అష్రాఫ్, మధ్యతరగతి, దిగువ తరగతులుగా విభజించి, నేర తీవ్రత కాకుండా వర్గం ఆధారంగా శిక్షలు నిర్ణయిస్తారు. 2021 తాలిబన్ అధికారం తర్వాత బాలికల చదువు, ఉద్యోగాలు, ఒంటరి సంచారం, సినిమాలపై పూర్తి నిషేధం. హెచ్‌ఆర్‌డబ్ల్యూ, యూఎన్ఏఎంఏ ఈ చట్టాన్ని ‘జెండర్ అపార్థీడ్‘ అని విమర్శిస్తూ అమలును ఆపమని కోరాయి. ఐసీసీ తాలిబన్ నేతలపై వారంట్‌లు జారీ చేసింది. అయినా అక్కడ మహిళల హక్కుల హననం ఆగడం లేదు.

## బాలికకు మద్యం తాగించి సామూహిక అత్యాచారం

**ముద్ర, బండ్లగూడ :**

ఓ మైనర్ కు బలవంతంగా మద్యం తాగించి ఇద్దరు మైనర్ బాలురు, ఓ యువకుడు సామూహిక అత్యాచారం చేసిన ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.... పుప్పాలగూడలో నివాసం ఉంటే 16ఏళ్ళ బాలిక స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ఈనెల 7న ఆమె షాపింగ్ కోసం చార్మినార్ వెళ్ళింది. అక్కడ పరిచయమైన మైనర్ బాలుడితో స్నేహం పెంచుకొని ఫోన్ నెంబరు మార్చుకున్నారు. ఈనెల 16న ఉదయం 8 గంటలకు ఆ బాలిక పాఠశాలకు వెళ్తున్న అని చెప్పి ఇంటి నుంచి వెళ్ళింది. రాత్రి అయిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వివిధ ప్రాంతాల్లో వెతికిన ప్రయోజనం లేకపోవడంతో నార్సింగి పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆ బాలిక చెంగిచెర్లలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద ఉన్నట్లు గుర్తించి తీసుకొచ్చారు. అయితే 16వ తేదీ తాను చార్మినార్ వెళ్లానని ఆరోజు రాత్రి తనకు పరిచయమైన మైనర్ బాలుడినితోపాటు, ఇమ్రాన్ అనే యువకుడు, మరో మైనర్ బాలుడు కలిసి తనను ఆటోలో చెంగిచెర్లకు తీసుకెళ్లారని బాలిక తెలిపింది. అక్కడ కత్తితో బెదిరించి బలవంతంగా మద్యం తాగించారని అనంతరం ముగ్గురు తనపై పలుమార్లు అత్యాచారం చేశారని ఆమె పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిలో ఓ మైనర్ బాలుడిని, ఇమ్రాన్ ను జడ్జి ముందు హాజరు పరిచారు. ఇమ్రాన్ ను చంచల్గూడా జైలుకు మైనర్ బాలుడిని జువైనల్ హోమ్ కి తరలించారు. పరారీలో ఉన్న మరో మైనర్ బాలుడి కోసం పోలీసులు వెతుకుతున్నారు.



## టాప్ 10 ఎన్ కౌంటర్స్

హైదరాబాద్ వెటర్నరీ డాక్టర్ కేసు ఎన్‌కౌంటర్ (2019) దిశ కేసులో నిందితులైన నలుగురిని పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చంపారు. ప్రజలు దీనిని సమర్థించినా, న్యాయపరంగా ఇది సరైందా అనే చర్చ దేశవ్యాప్తంగా జరిగింది.



# టీ20ల్లో వరుణ్ చక్రవర్తి రికార్డు



టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తీ అంతర్జాతీయ టీ20ల్లో అరుదైన ఘనత సాధించాడు. వరుసగా 17 మ్యాచ్‌ల్లో వికెట్లు తీసిన తొలి భారత స్పిన్నర్‌గా నిలిచి, పేసర్ అర్ష్‌దీప్ సింగ్ రికార్డును సమం చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో నెదర్లాండ్స్‌తో అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టడం ద్వారా వరుణ్ ఈ ఫీట్‌ను నమోదు చేశాడు. పవర్‌ప్లే చివరి ఓవర్‌లో మాక్స్ ఓ డౌడ్‌ను క్లీన్ బౌల్డ్ చేయడం రికార్డు వికెట్‌గా నిలిచింది. ఇది వరుణ్‌కు వరుసగా 17వ మ్యాచ్‌లో వచ్చిన వికెట్ కావడం విశేషం. 2025 నుంచి ఇప్పటివరకు వరుణ్ వరుసగా 17 మ్యాచ్‌ల్లో మొత్తం 31 వికెట్లు తీశాడు. భారత బౌలర్లలో ఈ జాబితాలో అతడు అర్ష్‌దీప్‌తో కలిసి అగ్రస్థానంలో నిలిచాడు. ఆశిష్ నెహ్రా వరుసగా 13 మ్యాచ్‌ల్లో వికెట్లు తీసి తరువాతి స్థానంలో ఉన్నాడు. ప్రపంచకప్‌లో వరుణ్ ఫామ్ అదిరిపోతోంది. అమెరికాపై ఒక వికెట్, నమీబియాపై మూడు, పాకిస్థాన్‌పై రెండు, నెదర్లాండ్స్‌పై మూడు వికెట్లు తీసి నాలుగు మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. నెదర్లాండ్స్ మ్యాచ్‌లో మూడు ఓవర్లలో కేవలం 14 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు తీసాడు.

**వరుసగా వికెట్లు తీసిన భారత బౌలర్లు**

**వరుణ్ చక్రవర్తీ – 17 మ్యాచ్‌లు***
**అర్ష్‌దీప్ సింగ్ – 17 మ్యాచ్‌లు**
**ఆశిష్ నెహ్రా – 13 మ్యాచ్‌లు**

**టీ20ల్లో వరుసగా అత్యధిక మ్యాచ్‌ల్లో వికెట్లు**

**సందీప్ లామిచానే (నేపాల్) – 26**
**ఆదిల్ రషీద్ (ఇంగ్లండ్) – 24**
**వానిందు హసరంగా (శ్రీలంక) – 23**
**వరుణ్ చక్రవర్తీ (భారత్) – 17***
**అర్ష్‌దీప్ సింగ్ (భారత్) – 17**
**ఇష్ సోధి (న్యూజిలాండ్) – 16**

**సూపర్–8 దశకు ముందు వరుణ్ మిస్టరీ స్పిన్‌ను ప్రత్యర్థులు అర్థం చేసుకోకుండా జాగ్రత్తగా వినియోగిస్తున్నట్లు టీమ్ వర్గాలు భావిస్తున్నాయి**

# మహిళా క్రికెట్‌లో దిగ్గజాలను దాటేసిన హర్మన్‌ప్రీత్..!



మహిళా క్రికెట్‌లో దిగ్గజాలను దాటేసిన హర్మన్‌ప్రీత్..!

భారత మహిళా క్రికెట్‌ను కొత్త ఎత్తులకు తీసుకెళ్లిన సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ మరో విశేష ఘనత సాధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళగా ఆమె కొత్త రికార్డు నెలకొల్పింది. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌తో ఆమె ఈ మైలురాయిని అందుకుంది. ఇప్పటివరకు న్యూజిలాండ్‌కు చెందిన సుజీ బేట్స్ పేరిట ఉన్న రికార్డును హర్మన్‌ప్రీత్ అధిగమించింది. మొత్తం 356 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతూ ఆమె ఈ ఘనతను సొంతం చేసుకుంది. ఆమె తర్వాతి స్థానాల్లో ఎలీసా పెర్రీ (349), మిథాలీ రాజ్ (333), చార్లొట్టే ఎడ్వర్డ్స్ (309), సోఫీ డెవినె (305) ఉన్నారు. 1989 మార్చి 8న పంజాబ్‌లో జన్మించిన హర్మన్‌ప్రీత్ చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుంది. అబ్బాయిలతో కలిసి సాధన చేస్తూ తన ఆటను మెరుగుపర్చుకుంది. 2009లో వన్డేల్లో అరంగేట్రం చేసి, అదే ఏడాది టీ20ల్లోనూ అడుగుపెట్టింది. క్రమంగా మూడు ఫార్మాట్లలో కీలక ఆటగాడిగా ఎదిగి, జట్టుకు నాయకత్వం వహించింది. ఆమె సారథ్యంలో భారత్ 2020 పొట్టి ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరింది. దేశానికి గర్వకారణంగా నిలుస్తూ హర్మన్‌ప్రీత్ కౌర్ మహిళా క్రికెట్‌లో సుస్థిర స్థానాన్ని సంపాదించింది. తాజా రికార్డు ఆమె సుదీర్ఘ కృషికి మరో ముద్రగా నిలిచింది.

# కాన్‌బెర్రాలో భారత్‌కు ఎదురుదెబ్బ...



**సిరీస్ నిర్ణయం అడిలైడ్‌లో**

కాన్‌బెర్రా వేదికగా జరిగిన రెండో టీ20లో భారత మహిళా జట్టుకు పరాజయం తప్పలేదు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగమైన ఈ పోరులో ఆతిథ్య జట్టు ఆస్ట్రేలియా 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో సిరీస్ 11తో సమం అయింది. నిర్ణాయక మ్యాచ్ ఫిబ్రవరి 21న అడిలైడ్లో జరుగనుంది. టాస్ గెలిచిన భారత్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 5 వికెట్లకు 163 పరుగులు చేసింది. జార్జియా వోల్ 88 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడి మ్యాచ్‌కు కీలకంగా నిలిచింది. ఆమె ప్రదర్శనకు గాను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. బెత్ మూనీ 46 పరుగులతో తోడ్పాటునిచ్చింది. భారత బౌలర్లలో అరుంధతి రెడ్డి రెండు వికెట్లు, రేణుకా సింగ్ ఠాకూర్ ఒక వికెట్ తీశారు. లక్ష్య ఛేదనలో భారత్ ఆశించిన ఆరంభం అందుకోలేకపోయింది. స్మృతి మంధాన హర్మన్‌ప్రీత్ కౌర్ 36, 31, షెఫాలీ వర్మ 29 పరుగులు చేసినా జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లలేకపోయారు. చివరికి భారత్ 9 వికెట్లకు 144 పరుగుల వద్దే ఆగిపోయింది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆష్లే గార్డెనర్ మూడు వికెట్లు సాధించగా, కిమ్ గార్త్, అన్నాబెల్ సదర్లాండ్, సోఫీ తలా రెండేసి వికెట్లు తీశారు. తొలి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన నేపథ్యంలో సిరీస్ ఇప్పుడు ఉత్కంఠభరితంగా మారింది. నిర్ణాయక పోరులో ఏ జట్టు పైచేయి సాధిస్తుందో చూడాలి





# మహీకా బర్త్‌డే.. హార్దిక్ రొమాంటిక్ పోస్ట్ వైరల్

టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వ్యక్తిగత జీవితం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. తన ప్రియురాలు మహీకా శర్మ 25వ పుట్టినరోజు సందర్భంగా ఆయన షేర్ చేసిన రొమాంటిక్ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అర్ధరాత్రి స్విమ్మింగ్ పూల్‌లో కలిసి ఉన్న ఫోటోకు "హ్యాపీ బర్త్‌డే మై ప్రిన్సెస్" అంటూ హార్దిక్ శుభాకాంక్షలు తెలిపాడు. ఢిల్లీకి చెందిన మహీకా ఎకనామిక్స్ అండ్ ఫైనాన్స్‌లో డిగ్రీ పూర్తి చేసింది. మోడల్‌గా, ఫిట్‌నెస్ కంటెంట్ క్రియేటర్‌గా గుర్తింపు పొందింది. 2024లో నటాషా స్టాంకోవిచ్‌తో విడాకుల తర్వాత హార్దిక్-మహీకాల స్నేహం ప్రేమగా మారినట్లు తెలుస్తోంది. మహీకా సపోర్ట్‌తో హార్దిక్ ఆటలోనూ దూకుడు చూపిస్తున్నాడు. 2026 టీ20 వరల్డ్ కప్‌లో కీలక మ్యాచ్‌ల్లో మెరిసి మ్యాచ్ విన్నర్‌గా నిలుస్తున్నాడు. వ్యక్తిగత ఆనందం, ప్రొఫెషనల్ ఫామ్ రెండింటినీ సమతుల్యం చేస్తున్నాడని అభిమానులు ప్రశంసిస్తున్నారు.

# తేనెటీగల దాడి.. అంపైర్ మృతి



ఉత్తరప్రదేశ్‌లోని *కాన్పూర్లో విషాద ఘటన జరిగింది. **కాన్పూర్ క్రికెట్ అసోసియేషన్*కు చెందిన అంపైర్ మణిక్ గుప్తా (65) తేనెటీగల దాడిలో మృతి చెందారు. అండర్-13 క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో మైదానంలోకి తేనెటీగల గుంపు దాడి చేయడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. చిన్న వయసు ఆటగాళ్లు తప్పించుకోగలిగినా, మణిక్ గుప్తా పరుగెత్తలేక తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శరీరంపై వందల సంఖ్యలో కాట్ల వల్ల విషం పాకి అనాఫిలాక్టిక్ షాక్‌కు గురయ్యారని వెల్లడించారు. మరో అంపైర్ జగదీశ్ శర్మతో పాటు పలువురు ఆటగాళ్లు గాయపడ్డారు. 30 ఏళ్లుగా క్రికెట్ అంపైర్‌గా సేవలందించిన మణిక్ గుప్తా మృతిపై క్రికెట్ వర్గాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి.





# మళ్లీ భారత్–పాక్ పోరు సాధ్యమా?



టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నీలో భారత్, పాకిస్తాన్ మరోసారి తలపడే అవకాశాలపై క్రీడా వర్గాల్లో చర్చ మొదలైంది. గ్రూప్ దశలో ఇప్పటికే ఈ రెండు జట్లు ఢీకొన్నాయి. శ్రీలంక వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌కు భారీ స్పందన లభించింది. స్టేడియంలోనే కాదు, టెలివిజన్ వ్యూయర్‌షిప్ పరంగా కూడా రికార్డు స్థాయి ఆసక్తి నమోదైంది.ఇప్పుడు పాకిస్తాన్ సూపర్ 8 దశకు చేరడంతో మరోసారి ఈ దాయాదుల మధ్య పోరు జరిగే అవకాశాలపై లెక్కలు మొదలయ్యాయి. భారత్ సూపర్ 8లో గ్రూప్ 1లో కొనసాగుతుండగా, పాకిస్తాన్ వేరు గ్రూప్‌లో ఉంది. ఈ దశలో ఈ రెండు జట్లు నేరుగా తలపడే పరిస్థితి లేదు. అయితే సమీకరణాలు అనుకూలిస్తే సెమీఫైనల్లో భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ సాధ్యమే. అందుకోసం భారత్ తన గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలవాలి. మరోవైపు పాకిస్తాన్ తన గ్రూప్‌లో రెండో స్థానాన్ని దక్కించుకోవాలి. అలా జరిగితే సెమీస్‌లో మరో హై వోల్టేజ్ పోరు చూడొచ్చు. ఇది సాధ్యంకాకపోయినా, రెండు జట్లు తమ తమ సెమీఫైనల్ మ్యాచ్‌లు గెలిస్తే ఫైనల్లో ఎదురెదురయ్యే అవకాశం ఉంది. ఆ సందర్భంలో కొలంబో వేదికగా ఫైనల్ మ్యాచ్ జరిగే అవకాశం ఉండటంతో క్రికెట్ అభిమానులు మరొకసారి భారత్-పాక్ సమరాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# చివరి ఓవర్లో జింబాబ్వే విజయం...

- **శ్రీలంకకు 6 వికెట్ల తేడాతో పరాజయం**

కొలంబో వేదికగా జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో 38వ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఇప్పటికే సూపర్ 8 దశకు చేరుకున్న శ్రీలంక, జింబాబ్వే జట్లు ఈ పోరులో తలపడ్డాయి. చివరి ఓవర్లో మ్యాచ్ తారుమారై, జింబాబ్వే 6 వికెట్ల తేడాతో గెలుపొందింది.టాస్ గెలిచిన శ్రీలంక ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు సాధించి పోటీ స్కోరు నిలబెట్టింది. ఆరంభం జాగ్రత్తగా సాగినప్పటికీ మధ్య ఓవర్లలో వేగం పెంచి స్కోరు బలపరిచింది.179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే ధైర్యంగా బ్యాటింగ్ చేసింది. మధ్యలో కొన్ని వికెట్లు కోల్పోయినా, చివరి ఓవర్లలో ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంది. చివరి ఓవర్లో కావాల్సిన పరుగులు సాధిస్తూ విజయాన్ని ఖాయం చేసింది.ఈ ఫలితంతో జింబాబ్వే ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోగా, శ్రీలంకకు ఇది ఊహించని ఎదురుదెబ్బగా మారింది. సూపర్ 8 ముందు ఈ మ్యాచ్ రెండు జట్లకూ కీలక పాఠాలను నేర్పింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
20.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





# ఆ బాధ ఎలా ఉంటుందో తెలిసింది



అస్సీ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించిన తాప్సీ పన్ను మరోసారి సామాజిక అంశంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అనుభవ్ సిన్హా దర్శకత్వంలో రూపొందిన ఈ న్యాయస్థాన నేపథ్యంలో సాగే చిత్రం ఫిబ్రవరి 20న విడుదల కానుంది. ఇందులో అత్యాచారానికి గురైన మహిళ "పరిమ"గా నటించిన కని కుస్రుతి తన అనుభవాలను పంచుకున్నారు. ఆ పాత్రలో లీనమవడం తనకు అతి పెద్ద సవాల్‌గా మారిందన్నారు. న్యాయస్థాన విచారణలో బాధితులు ఎదుర్కొనే మానసిక వేదన ఎంత తీవ్రమో ఈ కథ ద్వారా తెలుసుకున్నానని తెలిపారు. పాత గాయాలను మళ్లీ గుర్తు చేసే ప్రతి ప్రశ్న ఒక మహిళకు ఎంతటి వేదన కలిగిస్తుందో అర్థమైందని ఆవేదన వ్యక్తం చేశారు.ఢిల్లీలో జరిగిన సామూహిక అత్యాచారం నేపథ్యంలో న్యాయం కోసం జరిగే పోరాటమే ఈ చిత్ర కథాంశం. దేశంలో రోజుకు సగటున 80 అత్యాచార ఘటనలు నమోదవుతున్నాయనే సూచనతోనే చిత్రానికి 'అస్సీ' అనే పేరు పెట్టారు. ఇటీవల విడుదలైన ప్రచార దృశ్యాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి.

## ఫ్యాషన్ ట్రెండ్స్‌లో మాళవిక మెరుపులు

తెలుగు ఎంట్రీగా వచ్చిన 'రాజా సాబ్' ఆశించిన స్థాయిలో హిట్ కాకపోయినా, మాళవిక మోహనన్ గ్లామర్ మాత్రం తగ్గలేదు. తాజాగా ఆమె చేసిన ట్రెడిషనల్ ఫొటోషూట్ సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది.గులాబీ రంగు లెహంగా మీద బంగారు పూల డిజైన్లు రాజసంగా మెరిసాయి. డీప్ నెక్ బ్లౌజ్‌పై సున్నితమైన ఎంబ్రాయిడరీ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేసింది. షీర్ దుపట్టా, చోకర్ హారం, సరిపోయే గాజులుఅన్నీ కలిసి క్లాసీ లుక్ ఇచ్చాయి. మితమైన మేకప్, నిగూఢమైన హావభావాలు ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.2026లో తమిళంలో వస్తున్న 'సర్దార్ 2' సినిమాతో కూడా మాళవిక ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా ఫలితం ఎలా ఉన్నా, స్టైల్ విషయంలో మాళవిక ఎప్పుడూ ముందుంటుందనే విషయం ఈ ఫొటోలు మరోసారి చెబుతున్నాయి.

## సుకుమార్‌తో మిస్సయినా... వేణుతో తెరంగేట్రం



సంగీత దర్శకుడిగా అపార విజయాలు అందుకున్న దేవిశ్రీ ప్రసాద్ ఒక దశలో హీరోగా కూడా పరిచయం కావాల్సింది. ముఖ్యంగా దర్శకుడు సుకుమార్ దర్శకత్వంలోనే ఆయన నటుడిగా ఎంట్రీ ఇవ్వాలన్న ప్రణాళిక రూపుదిద్దుకుంది. సుకుమార్ చిత్రాలకు దేవిశ్రీ స్వరాలే బలం కావడంతో, ఈ సృజనాత్మక బంధం తెరపైకి కూడా రావాలని భావించారు. అయితే తండ్రి మరణంతో ఆ ప్రాజెక్టు ఆగిపోయింది.నటనపై ఆసక్తిమాత్రం తగ్గలేదు.దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్,హరీశ్ శంకర్,నిర్మాత దిల్ రాజు ప్రోత్సాహం ఆయనకు ధైర్యం ఇచ్చింది. ఇప్పుడు ఆ కల ఎల్లమ్మ చిత్రంతో నెరవేరుతోంది. 'బలగం'తో గుర్తింపు పొందిన వేణు యెల్దండి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.గ్రామీణ నేపథ్యంలోని ఈకథలోదేవిశ్రీ డప్పు కళాకారుడిగా కనిపించనున్నారు. విశేషంగా, ఈ చిత్రానికి సంగీతాన్నీ ఆయనే అందిస్తున్నారు. సుకుమార్‌తో మిస్సైన అవకాశం ఆలస్యంగా అయినా వేణుతో సాకారం అవుతోంది.

## 'ది కేరళ స్టోరీ 2' కు సెన్సార్ యూ/ఏ సర్టిఫికెట్




2023లో తీవ్ర చర్చల మధ్య విడుదలై ప్రశంసలు, విమర్శలు రెండూ అందుకున్న 'ది కేరళ స్టోరీ'కు ఇప్పుడు సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2' సిద్ధమైంది. తాజాగా ట్రైలర్ విడుదల కావడంతో మరోసారి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. కథాంశం, చూపించిన అంశాలపై వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సెన్సార్ బోర్డు చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ మంజూరు చేసింది. దీనిపై చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది. తమ ఉద్దేశం సమాజంలో ముఖ్యంగా మహిళల్లో అవగాహన పెంచడమేనని, ఈ సందేశం అన్ని వయసుల ప్రేక్షకులకు చేరాలని భావిస్తున్నామని తెలిపారు. యూ/ఏ సర్టిఫికెట్ రావడం తమకు నైతిక విజయంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక మరోవైపు వివాదం మాత్రం చల్లారే సూచనలు కనిపించడం లేదు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సినిమా కంటెంట్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులోని కొన్ని సన్నివేశాలు మతసామరస్యానికి భంగం కలిగించేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సినిమాను బహిష్కరించాలని కూడా పిలుపునిచ్చారు. కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 27న విడుదలకు సిద్ధమవుతోంది. విడుదలకు ముందు నుంచే చర్చనీయాంశంగా మారిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలా ప్రభావం చూపుతుందో చూడాలి.

## 'మిరాకిల్' తో రాబోతున్న హెబ్బా పటేల్



టాలీవుడ్ నటి హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా యాక్షన్ ప్రధాన చిత్రం 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'ఫైటర్ శివ' చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు పొందిన ప్రభాస్ నిమ్మల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల చిత్రీకరణ పూర్తి కాగా, మూడో విడత ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభం కానుంది. ఈ దశలో హెబ్బా పటేల్ చిత్రీకరణలో పాల్గొననున్నారు. సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ పతాకంపై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు కథానాయకుడిగా నటిస్తుండగా, శ్రీరామ్, సురేష్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. నాయుడు పెంద్ర ప్రతినాయకుడిగా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ మేళవింపుతో ఈ చిత్రం రూపొందుతోంది. సీనియర్ పాత్రికేయుడు ధీరజ అప్పాజీ న్యాయ వైద్యాధికారిగా నటిస్తున్నారు. కథ, సంభాషణలు, కథా నిర్మాణంతో పాటు సంగీతాన్ని కూడా దర్శకుడు ప్రభాస్ నిమ్మలే సమకూరుస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

## 'రాజా శివాజీ'గా రితేష్ ..

**ఆకట్టుకుంటున్న పోస్టర్**

మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బాలీవుడ్ నటుడు, దర్శకుడు రితేష్ దేశ్ ముఖ్ తన ప్రతిష్ఠాత్మక చిత్రం రాజా శివాజీ సినిమా గురించి ముఖ్య ప్రకటన చేశారు. శివాజీ మహారాజ్‌కు నివాళిగా సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేసి, విడుదల తేదీని కూడా ప్రకటించారు. ఈ చిత్రంలో శివాజీ మహారాజ్ పాత్రను రితేష్ స్వయంగా పోషిస్తూ, దర్శకత్వ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. జెనీలియా సమర్పణలో ముంబై ఫిల్మ్ కంపెనీ, జియో స్టూడియోస్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 మే 1న మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మరాఠీ, హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రఖ్యాత ఛాయాగ్రాహకుడు సంతోష్ శివన్ సినిమాటోగ్రాఫీ అందిస్తుండగా, అజయ్ అతుల్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. స్వరాజ్య స్థాపన కోసం శివాజీ మహారాజ్ చేసిన మహోన్నత పోరాటాన్ని ఈ చిత్రం ప్రతిబింబించనుంది.







## 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటకు రెడీ!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం ఉస్తాద్ భగత్‌సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. వీరి కలయికలో వచ్చిన గబ్బర్ సింగ్ సూపర్ హిట్ తర్వాత మరోసారి ఈ జోడీ కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్ర బృందం వేగవంతం చేసింది. ఇప్పటికే ఒక పాటను విడుదల చేసి మంచి స్పందన అందుకున్న టీమ్, తాజాగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే పాట ప్రోమోను అభిమానులతో పంచుకుంది. చిన్న టీజర్‌లోనే పవన్ కళ్యాణ్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్ స్పష్టంగా కనిపించగా, నేపథ్య సంగీతం ఉత్సాహాన్ని పెంచేలా ఉంది.ప్రోమోలో కనిపించిన దృశ్యాలు, సంగీత బాణీలు ఈ పాటకు ప్రత్యేకమైన శక్తిని అందిస్తున్నాయి. అభిమానులను ఆకట్టుకునేలా మాస్ ఎలిమెంట్స్‌తో ఈ గీతం రూపొందినట్లు అర్థమవుతోంది. పూర్తి పాటను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. 'గబ్బర్ సింగ్' తర్వాత ఈ కాంబినేషన్‌పై ఉన్న అంచనాలను దృష్టిలో పెట్టుకుని, 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రాన్ని మరింత విభిన్నంగా తీర్చిదిద్దినట్లు సమాచారం. ప్రస్తుతం సోషల్ మీడియాలో 'ఆరా ఆఫ్ ఉస్తాద్' ప్రోమో చర్చనీయాంశంగా మారింది. పూర్తి పాట విడుదలతో మరింత హైప్ పెరగడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com